శుక్రవారం
01-07-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 10
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

స్థాపితం 1952 విశాలాంధ్ర 70

ఆర్టీసీ బాదుడు

డీజిల్ సెస్ పేరుతో బస్సు చార్జీల పెంపు

- ప్రయాణికులపై భారం
- నేటి నుంచే అమలు
- పెరగనున్న పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, లగ్జరీ టికెట్లు
- సిటీ బస్సులకు మినహాయింపు
- కిలోమీటర్, స్లాబ్‌ల ఆధారంగా ధరలు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:
ఆర్టీసీ ప్రయాణికులపై ప్రభుత్వం మరోమారు భారం మోపింది. డీజిల్ సెస్ పేరుతో చార్జీల మోతకు రంగం సిద్ధం చేసింది. శుక్రవారం నుంచి పెరిగిన ధరలు అమలులోకి వచ్చేలా ఉత్తర్వులు జారీచేసింది.ప్రయాణికులు వెళ్లే కిలో మీటర్ల ఆధారంగా స్లాబ్ పద్ధతిలో డీజిల్ సెస్ పెంపునకు ప్రభుత్వం నిర్ణయించింది. సిటీ సర్వీసులకు సెస్సు పెంపునుంచి మినహాయింపునిచ్చింది. దీని ప్రభావంతో విద్యార్థుల బస్ పాస్‌ల ధరలు దాదాపు 20శాతం పెరిగే అవకాశముంది. పల్లెవెలుగు బస్సు ప్రస్తుత టికెట్ ధర రూ.10గా ఉంది. మొదటి 30 కిలోమీటర్ల వరకు సెస్ పెంచింది. ఈ బస్సుల్లో 35 నుంచి 60 కిలోమీటర్ల దూరానికి రూ.5 పెంచింది. 60 నుంచి 70 కిలోమీటర్ల వరకు అదనంగా రూ.10 పెరగనుంది. 100 కిలో మీటర్లు, ఆపైన రూ.120 సెస్ విధించారు. ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సుల్లో ప్రస్తుతం టికెట్‌పై రూ.5 సెస్ వసూలు చేస్తున్నారు. ఈ బస్సుల్లో 30 కిలోమీటర్ల వరకు సెస్ పెంపు లేదు. 31 నుంచి 65 కిలోమీటర్ల వరకు మరో రూ.5 సెస్, 66 నుంచి 80 కిలోమీటర్ల వరకు రూ.10 సెస్ పెంచారు. సూపర్ లగ్జరీ, ఏసీ బస్సుల్లో టికెట్‌పై రూ.10 డీజిల్ సెస్ వసూలు చేస్తున్నారు. ఈ బస్సుల్లో 55 కిలోమీటర్ల వరకు సెస్ పెంపు లేదు. విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే సూపర్ లగ్జరీ బస్సుల్లో రూ.70 సెస్, హైదరాబాద్ వెళ్లే అమరావతి బస్సుల్లో రూ.80 చొప్పున డీజిల్ సెస్ విధించారు. ఏపీఎస్ఆర్టీసీ ఏపీతోపాటు వివిధ రాష్ట్రాలకు నిత్యం 11,271 బస్సులను 41 లక్షల కిలోమీటర్లు నడుపుతోంది. 45 లక్షల

- మిగతా 2 లో

మహారాష్ట్ర సీఎంగా ఏక్‌నాథ్ షిండే

- ఉప ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్
- రాజ్‌భవన్‌లో ఇద్దరి ప్రమాణ స్వీకారం

న్యూఢిల్లీ / ముంబై :
మహారాష్ట్ర రాజకీయాలు అనుహ్యంగా మారిపోయాయి. నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. బీజేపీ కుయుక్తులు ఫలించాయి. శివసేన తిరుగుబాటు నేత ఏక్‌నాథ్ షిండే ముఖ్యమంత్రిగా, బీజేపీ నేత, మాజీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఉపముఖ్యమంత్రిగా గురువారం రాజ్‌భవన్‌లో ప్రమాణం చేశారు. గవర్నర్ భగవ్ సింగ్ కోశ్యారీతో భేటీ అనంతరం షిండే సీఎం కాబోతున్నట్లు ఫడ్నవీస్ ప్రకటించారు. ఉప ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టాలని ఫడ్నవీస్‌ను బీజేపీ కోరడంతో ఆయన అంగీకరించినట్లు తెలిసింది. తన ప్రమాణ స్వీకరానికి కొన్ని గంటల ముందు మీడియాతో మాట్లాడుతూ, 'నేను ప్రభుత్వంలో ఉండి అది సజావుగా సాగేలా చూస్తాను. ముఖ్యమంత్రిగా షిండే మాత్రమే ప్రమాణం చేస్తారు' అని ఫడ్నవీస్ తెలిపారు. అయితే బీజేపీ అధిష్ఠానం కోరిక మేరకు ఆయన షిండేతో పాటే ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రధాని మోదీ, ఫడ్నవీస్‌తో పాటు బీజేపీ ఇతర నేతలకు ఏక్‌నాథ్ షిండే కృతజ్ఞతలు తెలిపారు. తనను సీఎం చేయడం వారి గొప్పతనమన్నారు. ఉప ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించిన ఫడ్నవీస్‌ది పెద్ద మనస్సు అని ప్రశంసించారు. ఫడ్నవీస్, ఏక్‌నాథ్ షిండే గురువారం మధ్యాహ్నం

- మిగతా 2 లో

సత్యసాయి జిల్లాలో విషాదం

ఐదుగురి సజీవదహనం

- వ్యవసాయ కూలీల ఉసురు తీసిన కరెంటు తీగలు
- ఆటోలో వెలుతూ మృత్యు ఒడిలోకి
- మృతుల కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా

2లో

మాట్లాడుతున్న కత్తి నరసింహారెడ్డి, వేదికపై రామకృష్ణ, చంద్రానాయక్, లెనిన్‌బాబు, ఈశ్వరయ్య, రమేశ్ పట్నాయక్, లక్ష్మణరావు తదితరులు

విద్యారంగం విధ్వంసం

- మోదీ, జగన్ సంస్కరణలతో భారీ ముప్పు
- ఎన్ఈపీకి వ్యతిరేకంగా ఉద్యమం
- ఏఐఎస్ఎఫ్ సదస్సులో వక్తలు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:
నూతన విద్యా విధానం (ఎన్ఈపీ)–2020 పేరిట కేంద్రంలోని మోదీ, రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వాలు విద్యా రంగాన్ని విధ్వంసం చేస్తున్నాయని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడ ఐఎంఏ హాలులో గురువారం అఖిలభారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర సమితి 'నేటి విద్యారంగం–సమస్యలు –పరిష్కార మార్గాలు' అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించింది. దీనికి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు అధ్యక్షత

- మిగతా 2 లో

రాష్ట్రపతి బరిలో ముర్ము, సిన్హా

మిగతా అభ్యర్థుల నామినేషన్ల తిరస్కరణ

న్యూఢిల్లీ :
రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థి ద్రౌపది ముర్ము, ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి యశ్వంత్ సిన్హా మాత్రమే పోటీలో ఉన్నారు. మిగిలిన వారి నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. 29వ తేదీతో నామినేషన్ల దాఖలుకు గడువు ముగిసింది. ఎన్డీయే తరఫున ఒడిశాకు చెందిన గిరిజన మహిళ, జార్ఖండ్ మాజీ గవర్నర్ ద్రౌపది ముర్ము బరిలో నిలిచారు. ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా బీజేపీ మాజీ నేత, కేంద్ర ఆర్థికశాఖ మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా పోటీ చేస్తున్నారు. అధికార, విపక్షాల అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందినట్లు రాష్ట్రపతి ఎన్నికల రిటర్నింగ్ అధికారి (రాజ్యసభ సెక్రటరీ జనరల్) పీసీ మోదీ గురువారం తెలిపారు. మొత్తం 94 మంది అభ్యర్థుల నుంచి 115 నామినేషన్లు రాగా

- మిగతా 2 లో

K.B.N C A ACADEMY
A Golden Platform to become a C A Professional
powered by C A Professionals

We deem it a privilege to announce that K.B.N. COLLEGE (Autonomous) initiates to start "K.B.N C A ACADEMY" from 6th July, 2022 in the campus as another milestone in it's progress.

C A FOUNDATION CLASSES

New BATCH

6th July 2022 To 30th November 2022
Timings : From 1.30 P.M. to 6.45 P.M.
Venue : K.B.N. COLLEGE, Vijayawada

A.C. CLASSROOM

CA INTER CLASSES from FEBRUARY/ MARCH 2023.

SUBJECT	NAME OF FACULTY	No. of Hours
Paper-1: Principles and Practice of Accounting	CA. P.N.V.S. Ramakrishna	120
Paper-2: Business Laws and Business Correspondence and Reporting	CA. M. Sarada Deepthi Sree	120
Paper-3: Business Mathematics & Logical Reasoning and Statistics	Sri K.Durga Prasad (Maths) & Sri M. Satya Ram (Stat)	120
Paper-4: Business Economics and Business and Commercial Knowledge	Smt Ch.Kusuma (PhD)	120
Total		480

FORTNIGHTLY EXAMS ON A MONTHLY BASIS AND
MOCK TESTS IN THE MONTH OF NOVEMBER 2022

COACHING FEE - ₹16,000/-
Contact : 9494455433 / 7901691359

ISO 9001:2015
NAAC 'A' GRADE CYCLE 3
K.B.N. CA ACADEMY
Sponsored by S.K.P.V.V. Hindu High Schools' Committee Kothapeta, Vijayawada - 520001
A College with Potential for Excellence (CPE) All India 92nd Rank in NIRF by MHRD (2017)
Recognized as Band PERFORMER in ARIIA by Ministry of Education, Govt. of India

మా జోలికొస్తే ఊరుకోం..

నాటోకు రష్యా, చైనా దేశాల హెచ్చరిక

2లో

ఇదీ లోకం!

మా జోలికొస్తే ఊరుకోం..

నాటోకు రష్యా, చైనా దేశాల హెచ్చరిక

మాడ్రిడ్ : రష్యాతో ప్రత్యక్ష ముప్పు ఉందని, చైనా తీవ్ర సవాళ్లను విసురుతోందని, ఈ దేశాలు ప్రపంచాన్ని అస్థిరపరుస్తాయని నాటో చేసిన వ్యాఖ్యలకు మాస్కో, బీజింగ్ గురువారం దీటైన బదులు ఇచ్చాయి. తమ జోలికి వస్తే ఊరుకునేది లేదని తేల్చిచెప్పాయి. తమ దేశాల ప్రయోజనాలను దెబ్బతీస్తే సహించేది లేదని ఆయా దేశాలు ప్రకటనలు వెలువరించాయి. మాడ్రిడ్‌లో పాశ్చాత్య సైనిక కూటమి (నాటో) శిఖరాగ్ర సమావేశం ముగిసింది. సైబర్ దాడులు మొదలు వాతావరణ మార్పు వరకు అనేక సమస్యలు -సవాళ్లను ప్రపంచం ఎదుర్కొంటోందని మాడ్రిడ్ సదస్సులో నాటో కూటమి వ్యాఖ్యానించింది. ప్రపంచానికి ముప్పు పొంచి వుందనేందుకు ఇది సంకేతామని పేర్కొంది. టర్కీ నుంచి ఎదురైన వ్యతిరేకతను అధిగమించిన అనంతరం తమ కూటమిలో చేరాలని ఫిన్లాండ్, స్వీడెన్‌కు నాటో నేతలు అధికారిక ఆహ్వానం పంపారు. నార్డిక్ దేశాల చేరికతో నాటో సభ్యదేశాల సంఖ్య 30కు పెరుగుతుంది. తద్వారా రష్యాతో పంచుకునే సరిహద్దులో 800 మైళ్లు నాటో పరిధిలోకి వస్తాయి. అయితే తమ భూభాగంలోని నాటో దళాలనుగానీ సైనిక మౌలికవసతులనుగానీ అనుమతిస్తే అందుకు మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుందని ఫిన్లాండ్, స్వీడెన్ దేశాలను రష్యా హెచ్చరించింది. ఇది కొత్తేమీ కాదని రష్యా హెచ్చరికలను ఎస్టోనియన్ ప్రధాని ఖాజా ఖల్లాస్ తీసిపారేశారు. రష్యా దేశాధ్యక్షుడు పుతిన్ నుంచి ఆశ్చర్యకరమైనవి ఏదో ఉండాలి కదా అంటూ ఎద్దేవా చేశారు. స్వీడెన్, ఫిన్లాండ్‌పై రష్యా నేరుగా దాడులు చేస్తుందా? అంటూ ప్రశ్నించారు. సైబర్ దాడేలే కాదు హైబ్రిడ్ దాడులకూ ఆస్కారం లేకపోలేదుగానీ జరుగుతున్నది సమాచార యుద్ధమే.. సంప్రదాయ యుద్ధం కాదు అని ఆయనన్నారు.

నాటో కూటమిపై చైనా దుమ్మెత్తిపోసింది. తమ దేశంపై దాడులకు కుట్ర జరుగుతోందని ఆరోపించింది. అస్థిరతకు మూలం నాటో అని దుయ్యబట్టింది. చైనాను సవాల్‌గా నాటో భావిస్తోంది కాబట్టి దానిపై మేము నిశిత నిఘా ఉంచడమే కాకుండా అనుగుణమైన విధంగా ప్రతిస్పందించాల్సి ఉంటుందంటూ చైనా వ్యాఖ్యానించింది. చైనా ప్రయోజనాలను తక్కువ చేసే చర్యలను ఉపేక్షించేది లేదని పేర్కొంది.

కాగా, నాటో నేతలు గురువారం మాడ్రిడ్ సదస్సు ముగింపు నేపథ్యంలో తమ దృష్టిని ఆఫ్రికాలోని సాహెల్ ప్రాంతం, మధ్యప్రాశ్చ్యంపై మళ్లించారు. ఆయా చోట్ల రాజకీయ అస్థిరత ఉంది. ఉక్రెయిన్‌పై యుద్ధం క్రమంలో వాతావరణ మార్పు-ఆహార అభద్రత నెలకొంది. పర్యవసానంగా శరణార్థులు యూరప్‌కు మళ్లించబడుతున్నారు. ఉమ్మడి సవాళ్లను ఎదుర్కొనేందుకు తమ భాగస్వాములతో కలిసి పనిచేస్తామని నాటో ప్రధాన కార్యదర్శి జెన్స్ స్టోలెన్‌బర్గ్ అన్నారు. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన తర్వాత తమ ఉమ్మడి రక్షణకు అతిపెద్ద సవాల్‌గా ఉక్రెయిన్‌పై రష్యా దాడులు మారాయన్నారు. ఈ యుద్ధం వల్ల ఐరోప అతలాకులం కాగా ప్రతిస్పందన చర్యగా నాటో సాయుధ దళాలు తూర్పు ఐరోపాలోకి ప్రవేశించాయి. కూటమిలోని సభ్యదేశాలు ఉక్రెయిన్‌కు అండగా నిలిచాయి. సైనిక, ఆయుధ సాయాన్ని అందించాయి. వీడియో లింకు ద్వారా సదస్సులో మాట్లాడిన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తమకు మరింత సాయం కావాలని కోరారు. ఆధునిక ఆయుధ వ్యవస్థలు, ఆయుధాలివ్వాలని నాటోకు విన్నవించారు. కీవ్‌కు అండగా నిలవండి లేదా రష్యాతో తలపడేందుకు సిద్ధం కండి అంటూ హెచ్చరించారు. ఇప్పుడు ఉక్రెయిన్ తర్వాత ఏ దేశం మాల్డోవా? బల్టిక్స్? లేక పోలాండ్? ఈ ప్రశ్నకు అవన్నీ అన్నదే సమాధానం అని జెలెన్‌స్కీ అన్నారు. కాగా, కూటమి తూర్పు పార్శ్వంలో సైనిక బలాన్ని పెంచాలన్న నిర్ణయం జరిగింది. రష్యా భవిష్యత్తు ప్రణాళికల గురించి రొమేనియా నుంచి బాల్టిక్ దేశాల వరకు ఆందోళన చెందుతున్నాయి. అలాగే, శీఘ్ర ప్రతిచర్య దళాలను ఎనిమిది రెట్లు అంటే 40,000 నుంచి 3,00,000 పెంచడానికి ప్రణాళికలను నాటో ప్రకటించింది. దళాలు వారి స్వదేశాలలో ఉంటాయి కానీ తూర్పున ఉన్న నిర్దిష్ట దేశాలకు అంకితమై పనిచేస్తాయని పేర్కొంది. మరోవైపు బ్రిటన్ గురువారం ఉక్రెయిన్‌కు మరో 1 బిలియన్ పౌండ్ల (%వి%1.21 బిలియన్లు) సైనిక సహాయాన్ని ప్రకటించింది.

ఆకలి కోరల్లో యెమెన్

టెహ్రాన్ : 2015లో యెమెన్‌పై సౌదీ నేతృత్వంలోని విధ్వంసకర యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి 19 మిలియన్లకు పైగా యెమెన్‌లు ఆకలితో అలమటిస్తున్నారని తాజా నివేదిక పేర్కొంది. యెమెన్‌లో ఆకలితో ఉన్న వారి సంఖ్య ఏడేళ్లలో అత్యధికంగా ఉందని, కొద్ది రోజుల్లోనే సహాయ కోత అమలవుతుందని యుఎన్ వెల్లడించింది. "కరవు అంచున ఉన్న 160,000 కంటే ఎక్కువ మంది19 మిలియన్లకు పైగా ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు" అని హ్యూమానిటేరియన్ అధికారి వెల్లడించారు. "నిధుల కోతలతో అవసరమైన వ్యక్తులకు సహాయం చేసే సామర్థ్యానికి ఆటంకం కలిగిస్తున్నాయి." నిధుల అంతరాయాల కారణంగా ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యుఎఫ్‌పీ) డిసెంబర్‌లో 8 మిలియన్ల మందికి ఆహార రేషన్‌లను తగ్గించగా గత నెలలో మరో రౌండ్ కోతలను ప్రవేశపెట్టాల్సి వచ్చిందని తెలిపింది. దాదాపు 5 మిలియన్ల మంది ప్రజలు తమ రోజువారీ అవసరాలలో సగం కంటే తక్కువ పొందుతున్నారు 8 మిలియన్ల మంది వారి రోజువారీ అవసరాలలో మూడింట ఒక వంతు కంటే తక్కువ మాత్రమే పొందుతున్నట్లు జిన్హువా నివేదించింది. వీరిలో 500,000 కంటే ఎక్కువ మంది తీవ్రమైన పోషకాహార లోపంతో బాధపడుతున్నారని తెలిపింది. యెమెన్‌లో 4 మిలియన్లకు పైగా ప్రజలు అంతర్గతంగా స్థానభ్రంశం చెందారు. 150,000 మంది నిర్వాసితులకు , దాదాపు 100,000 మంది శరణార్థులకు నగదు సహాయం, ఆశ్రయం అవసరమైన వస్తువులను సహాయం చేసినట్లు యూనిసెఫ్ వెల్లడించింది. యెమెన్‌లోని పరిస్థితిని ప్రపంచంలోని "అత్యంత మానవతా సంక్షోభం"గా యూనిసెఫ్ వర్ణించింది.

నాటో శిఖరాగ్ర సభను ఖండించిన యూరోపియన్ కమ్యూనిస్ట్ ఇనిషియేటివ్

మాడ్రిడ్: స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో జరుగుతున్న నాటో శిఖరాగ్ర సమావేశాన్ని యూరోపియన్ కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీలు తీవ్రంగా ఖండించాయి. ఉక్రెయిన్‌లో సామ్రాజ్యవాద యుద్ధానికి, ప్రజలపై నాటో దురాక్రమణను దుయ్యబట్టింది. నాటో 2030 వ్యూహాన్ని ప్రజలపై బలోపేతం చేయడానికి ప్రయత్నిస్తోందని యూరోపియన్ కమ్యూనిస్టు ఇనీషియేటివ్ ప్రకటించింది. ప్రపంచదేశాల్లో నాటోరాపిడ్ యాక్షన్ ఫోర్స్ చట్టబద్ధం చేయడాన్ని, తూర్పు ఐరోపాలోని యుద్ధ ప్రాంతాల్లో దృష్టిసారించి 300,000 మంది సైనికులను మోహరించిందని పేర్కొంది. రష్యాను చుట్టుముట్టేందుకు నాటో చేస్తున్న ప్రయత్నాన్ని, స్వీడన్, ఫిన్‌లాండ్ నాటో చేరికకు, ప్రపంచవ్యాప్తంగా దాని కార్యకలాపాల విస్తరణకు నాటో పెద్దఎత్తున చేస్తున్న ప్రయత్నాన్ని ఖండించింది. బూర్జువా ప్రభుత్వాలు, ఉదారవాద, సామాజిక ప్రజాస్వామ్య ప్రభుత్వాలు, ప్రజల సొమ్ముతో ఉక్రెయిన్‌లో సామ్రాజ్యవాద యుద్ధంలో పెరుగుతున్న సైనిక ప్రమేయాన్ని పెంచడంతోపాటు భారీ ఆయుధ కార్యక్రమాలతో అణ్వస్త్రాలను మోహరిస్తున్నాయని కమ్యూనిస్టు ఇనీషియేటివ్ ఆందోళన వెలిబుచ్చింది.

రాష్ట్రపతి బరిలో ముర్ము, సిన్హా

(మొదటిపేజీ తరువాయి)

అందులో 107 ప్రమాణాలు పాటించనందున తిరస్కరిం చారన్నారు. 26 మందికి సంబంధించిన 28 నామినేషన్‌లు దాఖలప్పుడే తిరస్కరిం చగా 72 మంది అభ్యర్థుల 87 నామినేషన్‌లను బుధవారం తిరస్కరించినట్లు తెలిపారు. ద్రౌపది ముర్ము, యశ్వంత్ సిన్హా నామినేషన్ పత్రాలు మాత్రమే ఒక్కొక్క టి నాలుగు సెట్లు ఉన్నాయని, ఆమోదం పొందాయని అన్నారు. నామినేషన్ల ఉప సంహరణకు చివరి తేదీ జూలై 2 మధ్యాహ్నం 3 గంటల తరువాత పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను గెజిట్‌లో ప్రచురిస్తామని ఆయన చెప్పారు. కాగా, రాష్ట్రపతి ఎన్నికలు జూలై 18న, ఓట్ల లెక్కింపు జూలై 21న జరుగనున్న విషయం విదితమే.

మహారాష్ట్ర సీఎంగా ఏక్‌నాథ్ షిండే

(మొదటిపేజీ తరువాయి)

గవర్నర్‌తో భేటీ అయి ప్రభుత్వం ఏర్పాటునకు సంబంధించి మెమోరాండాన్ని అందించారు. తమకు 170 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉండటంతో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. 39 మంది ఎమ్మెల్యేల మద్దతున్న తమదే నిజమైన శివసేన అని చెప్పుకున్నారు. కాగా, బలపరీక్షకు సుప్రీంకోర్టు అనుమతిచ్చిన కొద్ది నిమిషాలకే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఉద్ధవ్ ఠాక్రే బుధవారం ప్రకటించిన విషయం విదితమే.

ఇందుకు చింతిస్తారు: సంజయ్ రౌత్

శివసేనను వీడినందుకు తిరుగుబాటు ఎమ్మెల్యేలంతా చింతిస్తారని ఎంపీ సంజయ్ రౌత్ అన్నారు. వారు తమ మార్గాన్ని ఎంచుకున్నారు. పార్టీ నుంచి ఎలాంటి అవరోధాలు ఉండవు. వారు స్వేచ్ఛగా బీజేపీతో కలిసిపోవచ్చు అని వ్యాఖ్యానించారు.

ఇది బీజేపీ మాస్టర్ స్ట్రోక్: రాజకీయ విశ్లేషకులు

మహారాష్ట్ర ముఖ్యమంత్రి బాధ్యతలను షిండేకు అప్పగించడం బీజేపీ మాస్టర్ స్ట్రోక్ అని రాజకీయ విశ్లేషకులు భావించారు. సీనియర్ నేత, పాలనలో అనుభవం ఉన్న ఫడ్నవీస్‌ను కాదని శివసేనలో ఒక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న షిండేను సీఎం చేయడం వెనుక గొప్ప వ్యూహం ఉందన్నారు. ఉద్ధవ్ ఠాక్రేను మోసం చేశారన్న శివసేన వాదనను ఎదుర్కోవడం, శివసేన వర్గీయుల్లో తమ ప్రభుత్వమే ఏర్పడిందన్న భావన కల్పించడం ఈ వ్యూహం వెనుక ఆలోచనగా చెప్పారు. శివసేనలో తిరుగుబాటు వర్గంపై వ్యతిరేకతను తొలగించడం, షిండే వర్గమే అసలైన శివసేన అనే భావనను ప్రచారం చేయడమే ముఖ్యఉదేశమని అన్నారు. షిండే సీఎం అయినా, రిమోట్ కంట్రోల్ తమ వద్దనే ఉంటుందని, ఆయన షాడో సీఎంగా ఉంటారని బీజేపీ భావిస్తోందన్నారు.

షిండేపై పూర్తి విశ్వాసం ఉంది.. : ప్రధాని మోదీ

మహారాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన ఏక్‌నాథ్ షిండేకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన రాష్ట్రాన్ని కొత్త శిఖరాలకు చేర్చగలరన్న విశ్వాసం తనకు ఉందని అన్నారు. ప్రతి బీజేపీ కార్యకర్తకు ఆయన స్ఫూర్తి అని కొనియాడారు. షిండే అనుభవం, నైపుణ్యత రాష్ట్రానికి ఎంతగానో ఉపయోగపడుతుందని, మహారాష్ట్ర వృద్ధికి దోహదమవుతుందని మోదీ ఆకాంక్షించారు.

3 నుంచి అల్లూరి 125 జయంతోత్సవాలు

రాష్ట్ర వ్యాప్తంగా సభలు, సదస్సులు, ప్రదర్శనలు: వామపక్ష పార్టీలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అల్లూరి సీతారామరాజు 125వ జయంతోత్సవాల సందర్భంగా ఈనెల 3వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా సభలు, సదస్సులు, ప్రదర్శనలు నిర్వహించి ఘనంగా ఆ విప్లవ యోధునికి నివాళులు అర్పించాల్సిందిగా ప్రజలకు, ప్రజాతంత్రవాదులకు వామపక్ష పార్టీలు విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు గురువారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నుంచి వై.సాంబశివరావు, సీపీఐ (ఎంఎల్) నుంచి జాస్తి కిశోర్‌బాబు, ఎంసీపీఐ(యూ) నుంచి కాటం నాగభూషణం, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర నాయకులు ఎన్.మూర్తి, ఎస్‌యూసీఐ(సీ) నుంచి బీఎస్ అమర్ నాథ్, ఫార్వర్డ్ బ్లాక్ నుంచి పీవీ సుందర రామరాజు, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకులు జానకీ రాములు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీషువారికి గుండెలెదురిచ్చి పోరాడిన యోధుడు ఆయన. గిరిజనుల హక్కుల కోసం ప్రాణాలర్పించారన్నారు. కులాలు, మతాలు, తెగలు, ప్రాంతాలకతీతంగా సమైక్యంగా ఆయనకు నివాళులర్పించాలని విజ్ఞప్తి చేశారు. అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో మన్యం తిరుగుబాటు ప్రారంభమై వందేళ్లు నిండిందన్నారు. అల్లూరి 125 జయంతి సభలను జయప్రదం చేయాలని కోరారు.

విద్యారంగం విధ్వంసం

(మొదటిపేజీ తరువాయి)

వహించగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి స్వాగతం పలికారు. 26 జిల్లాల నుంచి ఏఐఎస్‌ఎఫ్ ప్రతినిధులు, వివిధ విద్యార్థి, యువజన సంఘాల నేతలు హాజరయ్యారు. ప్రధాన వక్తలుగా ఎమ్మెల్సీలు కత్తి నరసింహారెడ్డి, కేఎస్ లక్ష్మణరావు, విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్ రమేశ్ పట్నాయక్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హాజరయ్యారు.

జీఓ 117తో పాఠశాల విద్య అస్తవ్యస్తం: కత్తి నరసింహారెడ్డి

కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ... ఎన్‌ఈపీ అమలు కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో 117తో రాష్ట్రంలోని పాఠశాల విద్య అస్తవ్యస్తంగా మారనుందని చెప్పారు. ప్రధానంగా ఎలిమెంటరీ విద్యా విధానం అంతరించిపోతుందన్నారు. ఇంటర్ విద్యలో ప్రైవేట్ కళాశాలలు 3వేలు ఉండగా, ప్రభుత్వ కళాశాలలు కేవలం 480మాత్రమే ఉన్నాయని, అవి కూడా లెక్చెరర్ల కొరతతో అరకొరగా నడుస్తున్నాయన్నారు. జగన్ ప్రభుత్వం... ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు, సంఘాలతో చర్చించకుండా విద్యారంగంలో చేస్తున్న సంస్కరణలపె ఏకపక్షంగా అమలు చేస్తోందన్నారు. తాజాగా 8వ తరగతి నుంచి బైజూస్ కార్పొరేట్ కంపెనీతో ఆన్‌లైన్ పాఠాల ఒప్పందమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. రాష్ట్రంలో విద్యారంగాభివృద్ధి పరిరక్షణ కోసం విద్యార్థి, యువజనులు చేపట్టబోయే ఉద్యమాలకు తమ సంఘీభావం ఉంటుందన్నారు.

విద్యారంగ పరిరక్షణకు ఉద్యమించాలి: రామకృష్ణ

రామకృష్ణ మాట్లాడుతూ... మోదీ కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యా వ్యవస్థలో విభిన్న సంస్కరణల్ని తెస్తూ, కాషాయీకరణకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. విద్యాభివృద్ధికి ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. ఇటీవల దేశవ్యాప్తంగా 20మంది ఆచార్యుల బృందం ఒక సర్వే చేయగా... విశ్వవిద్యాలయాల్లో విద్యా విధానానికి దశ, దిశ లేదని తేటతెల్లమైందని చెప్పారు. నియామకాల్లో విపరీతమైన రాజకీయ జోక్యం, అకడమిక్ వ్యవస్థకు అధికారాలు ఇవ్వకపోడం, లక్ష్యాలు విద్యార్థులకు చేరకపోవడం వెరసి మొత్తం విద్యా వ్యవస్థ వృథాగా మారుతోందని సర్వేలో వెల్లడైందని చెప్పారు. విశ్వవిద్యాలయాలు జ్ఞాన సమూపార్జన కోసం కాక కేవలం విద్యార్థులు పోటీ పరీక్షలకు శిక్షణ తీసుకునేవిగా మారిపోయాయని అన్నారు. ప్రభుత్వ ఆధీనంలోని విశ్వవిద్యాలయాలను పక్కాగా నాశనం చేశారని, ఉప కులపతులు నియంతలుగా మారిపోయాయని మండిపడ్డారు. ఉన్నత విద్యలో విధ్వంసం, ఇంటర్ విద్యను కార్పొరేట్ పరం, ప్రాథమిక రంగంలో విచ్ఛిన్నం తరహాగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నిర్ణయాలున్నాయని విమర్శించారు. విద్యారంగ పరిరక్షణ కోస యువజన, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమించాలని, అందులో ఏఐఎస్‌ఎఫ్ అగ్రభాగంగా నిలవాలని కోరారు. 26 జిల్లాల్లో సదస్సులు నిర్వహించాలని, అందులో తల్లిదండ్రులనూ భాగస్వాములను చేయాలని సూచించారు.

ఎన్‌ఈపీ-2020 ముసుగులో విద్య ప్రైవేటీకరణ: కేఎస్ లక్ష్మణరావు

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ... విద్యారంగంలో కేంద్రం ఆధిపత్యం కొనసాగుతోందన్నారు. సెంట్రలైజేషన్, కమర్షియలైజేషన్, కమ్యూనలైజేషన్ పేరిట దేశంలోని 50శాతం విద్యా రంగాన్ని కార్పొరేట్ పరం చేస్తోందన్నారు. విద్యారంగంలోకి మతతత్వాన్ని, ఆరెస్సెస్ భావజాలాన్ని మోదీ ప్రభుత్వం జోడిస్తోందని విమర్శించారు. ఎన్‌ఈపీ-2020 ముసుగులో విద్య ప్రైవేటీకరణకు ఆహ్వానిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో ఎలాంటి సామాజిక న్యాయం, రిజర్వేషన్లు ఉండబోవని, ఫలితంగా పేదలకు విద్య దూరమవుతుందని వివరించారు. ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని, ఎయిడెడ్ వ్యవస్థను కొనసాగించాలని, 3,4,5 తరగతుల విలీనం ఆపేయాలని డిమాండ్ చేశారు. విద్య ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విద్యార్థి, యువజన సంఘాలు ఉద్యమాలతో ప్రభుత్వాలు దిగొచ్చేలా ఒత్తిడి పెంచాలని కోరారు.

డీఎస్సీ నిర్వహించాలి: రమేశ్ పట్నాయక్

రమేశ్ పట్నాయక్ మాట్లాడుతూ...మోదీ ప్రభుత్వం అధికార కేంద్రీకరణను వేగవంతంగా అమలు చేస్తోందన్నారు. విద్యను రాష్ట్రాల జాబితాలోనే ఉంచాలనే డిమాండుతో వామపక్ష విద్యార్థి, యువజన, ఉపాధ్యాయ సంఘాలతో కలిపి రాజకీయ ఉద్యమం నిర్మించాలని సూచించారు. ఏపీలో జగన్ ప్రభుత్వం ఒక పక్క పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నానంటూ... మరోపక్క వేలాది ఉపాధ్యాయ ఖాళీలను కనుమరుగు చేస్తోందన్నారు. తక్షణమే 30వేల ఉపాధ్యాయ ఖాళీలకు డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న మాట్లాడుతూ... ప్రస్తుత చదువులకు, చేస్తున్న ఉద్యోగాలకు పొంతన లేకుండా పోతోందన్నారు. జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 117 జీవో రద్దు కోసం ఉద్యమించాలన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రవిచంద్ర, మరో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ధనరాజ్ మాట్లాడుతూ...పాఠశాల విలీనం వంటి రాష్ట్ర ప్రభుత్వ వికృత చర్యలతో, విద్యా రంగం ఉనికిని కోల్పోతుందన్నారు. జాన్సన్‌బాబు, శివారెడ్డి మాట్లాడుతూ, ప్రాథమిక విద్యను జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, సమస్యలకు కేంద్రాలుగా విశ్వవిద్యాలయాలున్నాయని చెప్పారు. ఈ సదస్సులో తొలుత ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్రానాయక్ అభ్యుదయ గీతాలను ఆలపించారు. అనంతరం ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన ఐక్య ఉద్యమాల ఆవశ్యకత-విద్యార్థి, యువజనుల బాధ్యత అంశంపై జరిగిన సదస్సులో ఏఐఎస్‌ఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి జి.ఈశ్వరయ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.లెనిన్‌బాబు, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ తదితరులు ప్రసంగించారు.

ఆర్టీసీ బాదుడు

(మొదటిపేజీ తరువాయి)

ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చుతోంది. డీజిల్ సెస్ పేరుతో పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, అల్రాడీలక్స్, సూపర్ డీలక్స్, ఇంద్ర, గరుడ, మెట్రో లగ్జరీ-ఏసీ, అమరావతి, డాల్ఫిన్, నైట్ రైడర్ సీట్, నైట్ రైడర్ బెర్త్, వెన్నెల-30, వెన్నెల-24 విభాగాల బస్సు టికెట్లను కిలోమీటర్లు, స్లాబ్‌ల పద్ధతిలో పెంచడంపై విపక్షాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. పెంచిన చార్జీలను విరమించాలని డిమాండ్ చేస్తున్నాయి.

రెండు విడతలుగా టికెట్ల ధరల పెంపు: ఆర్టీసీ టిక్కెట్లు ధరలు11 డిసెంబరు 2019న పెంచారు. అప్పుడు లీటరు డీజిల్ ధర రూ.67 మాత్రమే ఉంది. ఈ ఏడాది ఏప్రిల్ 13వ తేదీన మార్కెట్‌లో డీజిల్ ధర రూ.107కు పెరిగింది. డిసెంబరు 2019 నుంచి ఏప్రిల్ 13 వరకు డీజిల్ ధర రూ.40కు చేరింది. ఈ కారణంగా ఏప్రిల్ 13న డీజిల్ సెస్‌ను ఆర్టీసీ విధించడంతో టికెట్ల ధరలు పెరిగాయి. మళ్లీ ఈనెల 29వ తేదీన మార్కెట్‌లో డీజిల్(బల్కు) ధర రూ.131కు పెరిగింది.

విధిలేని పరిస్థితుల్లోనే డీజిల్ సెస్ పెంపు: విధిలేని పరిస్థితుల్లో డీజిల్ సెస్ పెంచక తప్పడం లేదని, ప్రయాణికులు సహకరించి ఆర్టీసీని ఆదరించాలని ఆర్టీసీ చైర్మన్ ఎ.మల్లికార్జునరెడ్డి, ఎండీ ద్వారకా తిరుమలరావు విజ్ఞప్తి చేశారు.

చార్జీల పెంపును విరమించుకోవాలి: రామకృష్ణ

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై పదేపదే పన్నుల భారాలను వేస్తోందని, డీజిల్ సెస్ పేరుతో ఆర్టీసీ బస్ చార్జీల పెంపుదలను విరమించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండు చేశారు. ఇటీవలే డీజిల్ ధర పెరుగుదలను సాకుగా చూపి దాదాపు రూ.720 కోట్ల భారాన్ని రాష్ట్ర ప్రజలపై జగన్ సర్కారు మోపిందనీ, మరోసారి డీజిల్ సెస్ పేరుతో మళ్లీ చార్జీలు పెంచడం దారుణమన్నారు. పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, మెట్రో, లగ్జరీ బస్సుల్లో కిలో మీటర్ల చొప్పున టిక్కెట్లు ధరలు పెరిగాయన్నారు. బస్సు పాస్ ధరలను కూడా పెంచిందని పేర్కొన్నారు. విద్యుత్ చార్జీలను ఇప్పటికే ఏడు దఫాలుగా రాష్ట్ర ప్రభుత్వం పెంచిందన్నారు. రెండు సార్లు ఆర్టీసీ చార్జీలు పెంచి ప్రజలపై పెనుభారం మోపటం దుర్మార్గమని, ఆస్తి, నీటి, చెత్త పన్నులను విపరీతంగా పెంచి, బలవంతపు వసూళ్లకు పాల్పడుతోందన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలి కేవలం జనం జేబులకు చిల్లులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. తక్షణమే పెంచిన ఆర్టీసీ బస్సు చార్జీలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

సులభంగా వ్యాపారానికి అనువైన ఏపీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : సులభతర వ్యాపారానికి అనువైన (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మరోసారి సత్తా చాటింది. బిజినెస్ రీఫార్మ్స్ యాక్షన్ ప్లాన్-2020లో ఏపీ టాప్ ప్లేస్‌లో నిలిచింది. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ఢిల్లీలో టాప్ అచీవర్స్‌లో నిలిచిన 7 రాష్ట్రాలను ప్రకటించారు. ఈ లిస్టులో ఏపీ మొదటి స్థానంలో నిలిచింది. టాప్ అచివర్స్‌లో ఏపీతో పాటు గుజరాత్, హర్యానా, కర్నాటక, పంజాబ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలు ఉన్నాయి.97.89 శాతం స్కోర్‌తో ఏపీ ప్రథమస్థానంలో నిలవగా, 97.77శాతంతో గుజరాత్ ద్వితీయ, 96.97శాతంతో తమిళనాడు తృతీయ, 94.86శాతంతో తెలంగాణా నాల్గవస్థానంలో నిలిచాయి. కేంద్ర ప్రభుత్వం మొత్తం నాలుగు కేటగిరీలుగా రాష్ట్రాలకు ర్యాంకులను ఇచ్చింది. వ్యాపార సంస్కరణల ప్లాన్ అమలుచేస్తున్న రాష్ట్రాల జాబితాలోనూ ఏపీ టాప్‌లో నిలవడం విశేషం. 10,200 మంది పెట్టుబడిదారులు, స్టాక్ హోల్డర్ల నుంచి అభిప్రాయాలను సేకరించారు. అచివర్స్ లిస్టులో హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్ మహారాష్ట్ర, ఒడిషా, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు ఉన్నాయి. అస్పిరర్స్ లిస్టులో అసోం, ఛత్తీస్‌గఢ్, గోవా, జార్ఖండ్, కేరళ, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ ఉన్నాయి. మరోవైపు ఎమర్జింగ్, బిజినెస్, ఎకోసిస్టమ్స్ విభాగంలో 11 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు నిలిచాయి. వీటిలో ఢిల్లీ, పుదిచ్చేరి, త్రిపుర ప్రాంతాలు చోటు దక్కించుకున్నాయి.

విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లిన పీఎస్‌ఎల్వీ సీ- 53

విశాలాంధ్ర బ్యూరో, నెల్లూరు/ సూళ్లూరుపేట:

పీఎస్‌ఎల్వీ సీ-53 రాకెట్టు గురువారం శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ప్రయోగించగా విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్ సోమన్నాథ్ మాట్లాడుతూ, ఇది భారతదేశ ఖ్యాతిని మరింత పెంచిందని అన్నారు. ఈ ప్రయోగం విజయవంతంతో భవిష్యత్తులో మరిన్ని ప్రయోగాలు చేసేందుకు శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారని తెలిపారు.

భారతదేశం నేడు తన రాకెట్లను ప్రయోగించడమే కాక ఇతర దేశాల రాకెట్లను కూడా ప్రయోగించే వేదిక కావడం గర్వంగా ఉందన్నారు. రాకెట్ ప్రయోగానికి 26 గంటల ముందు నుంచి కౌంట్‌డౌన్ ప్రారంభించి గురువారం సాయంత్రం 6 గంటల 2 నిమిషాలకు 2వ లాంచర్ ప్యాడ్ నుంచి ప్రయోగించగా అది నాలుగు దశలలో విడిపోయి 19 నిమిషాల 26 సెకన్లలో కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశించిందన్నారు. సింగపూర్‌కు చెందిన ఈ రాకెట్టు 365 కిలోల బరువు గల భూ పరిశీలన ఉపగ్రహం డీఎస్‌ఈతో పాటు 155 కిలోల న్యూసర్ ఉపగ్రహం, నాన్యంగ్ టెక్నలాజికల్ యూనివర్సిటీ (ఎన్‌టీయూ) విద్యార్థులు తయారు చేసిన 2.8 కిలోల స్కూబ్ 1 అనే ఉపగ్రహం ప్రయోగించారు. ఇది పూర్తిగా వాణిజ్య ఒప్పందంతో జరుగుతున్న ప్రయోగం. రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు ఇస్రో అనుమతి ఇవ్వడంతో శ్రీహరికోట పరిసర ప్రాంతాల నుంచి సుమారు పది వేల మందికి ప్రత్యక్షంగా వీక్షించడానికి అవకాశం కలిగింది. ప్రయోగం విజయంతం కావడంతో సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, సీపీఐ నాయకులు మోదుగుల పార్థసారథి, మున్సిపల్ చైర్మ న్ శ్రీమంత్ రెడ్డి తదితరులు ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

యూఎస్ సుప్రీంకోర్టు జడ్జిగా కేతాంజీ బ్రౌన్ ప్రమాణం

మొదటి నల్ల జాతీయురాలిగా చరిత్ర

వాషింగ్టన్: కేతాంజీ బ్రౌన్ జాక్సన్ (51) గురువారం అమెరికా సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో ఆమె దేశంలోని అత్యున్నత న్యాయవ్యవస్థలో మొదటి నల్లజాతి మహిళగా చరిత్ర సృష్టించారు. దేశవ్యాప్తంగా అబార్షన్‌ను చట్టబద్ధం చేసిన 1973 రోయ్ వర్సెస్ వేడ్ ల్యాండ్‌మార్క్‌ను కోర్టు రద్దు చేసిన ఆరు రోజుల తర్వాత రిటైర్ అయిన లిబరల్ జస్టిస్ స్టీఫెన్ బ్రేయర్ స్థానంలో ఆమె ప్రమాణం చేశారు. కోర్టులో అత్యంత సీనియర్ సభ్యుడైన 83 ఏళ్ల బ్రేయర్ గురువారం అధికారికంగా పదవీ విరమణ చేశారు. 'కోర్టు సభ్యులందరి తరపున, జస్టిస్ జాక్సన్‌ను కోర్టుకు స్వాగతిస్తున్నందుకు నేను సంతోషిస్తున్నాను' అని ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్ ఈ సందర్భంగా జరిగిన వేడుకలో అన్నారు. జాక్సన్ 116వ న్యాయమూర్తి, ఆరవ మహిళ. 1789 నుంచి సుప్రీంకోర్టులో పనిచేస్తున్న మూడవ నల్లజాతి వ్యక్తి. ఫెడరల్ డిస్ట్రిక్ట్ జడ్జిగా ఎనిమిదేళ్లు పనిచేశారు. అధ్యక్షుడు బైడెన్ ఆమెను సుప్రీంకోర్టు జడ్జిగా నామినేట్ చేశారు.

ఐదుగురి సజీవదహనం

విశాలాంధ్రబ్యూరో-అనంతపురం(తాడిమర్రి):

వారంతా దినసరి కూలీలు... రోజూలాగే పనికోసం బయల్దేరారు... ఆటోలో కూర్చొని కబుర్లలో మునిగిపోయారు. సరిగ్గా వారు ప్రయాణిస్తున్న ఆటో... హై టెన్షన్ విద్యుత్ స్తంభం వద్దకు చేరుకోగానే, మిన్ను విరిగి మీద పడ్డట్టుగా... వేల వోల్టుల విద్యుత్ ప్రసరిస్తున్న తీగలు ఒక్కసారిగా తెగి ఆటో మీద పడ్డాయి. ఏం జరుగుతోందో అర్థమయ్యేలోపే మంటలు చుట్టు ముట్టాయి. ఆటో మొత్తం దగ్ధమైపోతుండగా హాహాకారాలు...ఆర్తనాదాలు మిన్నంటాయి. చూస్తుండగానే ఐదు నిండు ప్రాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఇసుమంతైనా తమ పొరపాటే లేని ప్రమాదానికి ఐదుగురు బలైపోయారు. సత్యసాయి జిల్లాలో జరిగిన ఈ హృదయ విదారక ఘటన స్థానికంగా సంచలనం రేకెత్తించింది.

ప్రమాద సమయంలో డ్రైవర్ తో కలిపి 13 మంది కూలీలు ఆటోలో ప్రయాణిస్తున్నారు. డ్రైవర్ పోతులయ్య, మరో ఏడుగురు కూలీలు మాత్రమే గాయాలతో బయటపడ్డారు. మృతులంతా మహిళలే. వీరిని కొంకా కాంతమ్మ (41), లక్ష్మీదేవి (43), రత్నమ్మ (46), కుమారి (44), రామలక్ష్మి (45)గా గుర్తించారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు... సత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం పెద్దకోట్ల గ్రామానికి చెందిన గుండ్లమడుగు రాజా, కుమారిలకు చిల్లకొండాయపల్లి సమీపంలో వ్యవసాయ పొలం ఉంది. కలుపు తీయడానికని వీరు గుడ్డంపల్లి కి చెందిన కొంక కాంతమ్మ, కొంకా లక్ష్మీదేవి, కొంకా రత్నమ్మ, కొంకా రామలక్ష్మి, కొంకా నాగేశ్వరమ్మ, కొంకా రమాదేవి, రత్నమ్మ, కొంకా అరుణ, కొంకా ఈశ్వరమ్మ, కొంకా గాయత్రి, శివ రత్నమ్మను తీసుకుని కునుకుంట్ల గ్రామానికి చెందిన డ్రైవర్ పోతులయ్య ఆటోలో వెళుతున్నారు. చిల్లకొండాయపల్లి సమీపంలో హైటెన్షన్ విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతూ ఉండటాన్ని గమనించిన ఆటోడ్రైవర్ పోతులయ్య (కునుకుంట్ల గ్రామ వాసి), వాహనాన్ని నిలిపి వెనక్కు తీసుకొస్తున్న సమయంలో ఆటోపై ఉన్న మంచానికి విద్యుత్ తీగలు తగలడంతో ఒక్కసారిగా విద్యుత్ సరఫరా అవడంతో మంటలు వ్యాపించాయి. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న పోతలయ్య, మరో ఐదుగురు మహిళలు కిందకు దూకారు. కానీ అప్పటికే మంటలు అంటుకోవడంతో ఆటోలోనే ఉండిపోయిన ఐదుగురు మహిళలు సజీవదహనం అయ్యారు. మరికొంతమంది గాయాలతో బయటపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ గాయత్రి అనే కూలీ అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటనపై మిగిలిన కూలీలు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకొని కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. కళ్లెదుటే ఐదుగురు మహిళలు సజీవ దహనమైపోయారు. మృతిచెందిన కూలీలంతా ఒకే గ్రామం, ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు. మృతదేహాలు పూర్తిగా కాలిపోవడంతో పోలీసులు, స్థానికులు కలిసి ట్రాక్టర్ లో ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం కొరకు తరలించారు.

గవర్నర్ దిగ్భ్రాంతి

మహిళా కూలీల సజీవ దహన దుర్ఘటనపై గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. జిల్లా యంత్రాంగం నుండి పూర్తి సమాచారం తీసుకోవాలని రాజ్ భవన్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియాకు ఆదేశాలు జారీచేశారు.

మృతుల కుటుంబాలకు రూ.10లక్షల పరిహారం: సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్యారిస్ పర్యటనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. మహిళా కూలీల సజీవదహనం ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సీఎంవో ద్వారా వివరాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం తరపున మృతుల కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున పరిహారం అందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రమాదంలో గాయపడ్డవారికి మెరుగైన వైద్యం అందించాలని, బాధితుల కుటుంబాలకు అండగా నిలవాలని ఆదేశించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలి: రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సత్యసాయి జిల్లాలో ఐదుగురు మహిళా కూలీల దుర్మరణంపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. విద్యుత్ శాఖాధికారుల అలసత్వం, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఎనిమిది నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెగిన హైటెన్షన్ వైర్లకు సకాలంలో విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేసి ఉంటే ఈ దుర్ఘటన జరిగేది కాదన్నారు. మృతులకు ప్రగాఢ సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10లక్షలు ప్రకటించిందనీ, అయితే రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, క్షతగాత్రులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రామకృష్ణ కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల నష్టపరిహారం అందచేయాలని డిమాండు చేశారు. మరణించినవారంతా రోజువారీ వ్యవసాయ కూలీలేనని, ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం ఏ మాత్రం సరిపోదన్నారు.

సామాన్యుల జీవనోపాధి దెబ్బతీస్తున్న మోదీ

జీకేఎంయూ అధ్యక్షుడు పెరియస్వామి

విశాలాంధ్ర -కీసర: వినాశకర వ్యవసాయ చట్టాలు, కార్మిక వ్యతిరేక చట్టాలు, సంక్షేమ బడ్జెట్‌లలో భారీ కోతలు విధించడం వంటి వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంటూ మోదీ ప్రభుత్వం సామాన్య ప్రజల జీవనోపాధిని దెబ్బతీస్తోందని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ)జాతీయ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎన్. పెరియ స్వామి విమర్శించారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, సాధారణ కార్మికులు, ప్రజల కష్టాలను, సమస్యలను, సంక్షేమాన్ని పట్టించుకోకుండా నిరంకుశ పాలన కొనసాగిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత ఆర్థిక వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని, తయారీ, ఉత్పత్తి క్షీణించి, సేవా రంగం తీవ్రంగా దెబ్బతిందని, ప్రభుత్వ రంగ ప్రైవేటీకరణను తమ ఎజెండాలో అగ్రస్థానంలో పెట్టి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నేడు అమ్మకాల జోరులో ఉందని, వ్యవసాయ రంగం కూడా మినహాయింపు కాదన్నారు. హైదరాబాద్, బోడుప్పల్, ఎస్ఎస్ఎస్ గార్డెన్స్ (కామ్రేడ్ గుండా మల్లేష్ హాల్)లో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం "వ్యవసాయ కార్మికుల సమస్యలపై" నిర్వహించిన రెండు రోజుల రాష్ట్ర స్థాయి వర్క్ షాప్ ముగింపు సమావేశం గురువారం జరిగింది, ఈ సమావేశానికి ఎన్.పెరియ స్వామి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిస్తూ దేశంలో ఆకలి, పేదరిక సూచిక భారతీయ జనాభా దుర్భరమైన దుస్థితిని చూపుతుందని, ఇవేవి పట్టించుకోకుండా కేంద్రంలోని బీజేపీ పాలకులు మతతత్వానికి సంబంధించిన తమ ఎజెండా అమలు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తూ దేశంలో మత, కుల హింసకు ఆజ్యం పోస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దళిత, గిరిజనులు, మైనారిటీలపై దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయని, అన్ని రాజ్యాంగ హక్కులు, పౌర హక్కులు నిర్మొహమాటంగా ఉల్లంఘిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో రైతులు, వ్యవసాయ కార్మికుల పరిస్థితి చాలా దుర్భరంగా ఉందని, వారిని లక్ష్యంగా చేసుకొని వారి మనుగడను దెబ్బతీయడానికి మోదీ ప్రభుత్వం విధానాలను రూపొందిస్తుందని తెలిపారు. కాలానుగుణ పొలం పనులు దొరికితే పుట గడవడం లేకుంటే నిరుద్యోగ బాధితులుగా ఉంటూ వ్యవసాయ కార్మికులు మునుపెన్నడూ లేని విధంగా అత్యంత అభద్రత నిరుపేద జీవితాన్ని గడుపుతున్నారన్నారు. వ్యవసాయ కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి రైతులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమాలు నిర్మించాలని పెరియస్వామి పిలుపునిచ్చారు. ఈ వర్క్ షాప్ లో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు కలకొండ కాంతయ్య, ప్రధాన కార్యదర్శి ఎన్. బాలమల్లేష్, బీకేఎంయూ కార్యవర్గ సభ్యులు టి.వెంకట్‌రాములు తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌తో ఉద్యోగ సంఘాల నేతల భేటీ

జీపీఎఫ్ ఖాతాల్లో సొమ్ము గల్లంతుపై చర్చ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్‌శర్మతో గురువారం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేతలు భేటీ అయ్యారు. ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాల్లో సొమ్ము గల్లంతు వ్యవహారంపై చర్చించారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ మాట్లాడుతూ, సాంకేతిక కారణాలతో నగదు డెబిట్ అయినట్లు అధికారులు చెప్పారనీ, దానిపై తాము సంతృప్తి చెందలేదంటూ సీఎస్‌కు వివరించారమన్నారు. నగదు డెబిట్‌పై న్యాయపోరాటం చేస్తామన్నారు. ఉద్యోగుల అనుమతి లేకుండా ఖాతాల నుంచి డబ్బులు తీయడం నేరమని, ప్రభుత్వం ఇచ్చిన వివరణ పూర్తిగా అవాస్తవమని చెప్పారు. డీఏ బకాయిల చెల్లింపుపై గతంలోనే ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. న్యాయనిపుణులతో సంప్రదింపుల తర్వాత కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. గతంలో డీఏ బకాయిలతోనే వేతనాలు పెరిగినట్లు అధికారులు చెప్పారనీ, ఇప్పుడేమో ఆ బకాయిలు వేయలేదంటూ బుకాయిస్తున్నారని మండిపడ్డారు. ఉద్యోగులు ఆందోళన చెందుతుంటే, ఆర్థిక శాఖాధికారులు పిట్ట కథలు చెప్పడం తగదన్నారు.

వృత్తుల కార్పొరేషన్లకు నిధులు కేటాయించండి

5న జిల్లా కార్యాలయాల వద్ద ధర్నా

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: వృత్తుల కార్పొరేషన్‌లకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నిధులు కేటాయించాలని చేతి వృతిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం సీఆర్ భవన్‌లో ఆయన మాట్లా డుతూ, వృతిదారుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు జులై 5న బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ఆఫీసుల ఎదుట జరిగే ధర్నాలను జయప్రదం చేయా లని కోరారు. తనకు ఒకసారి అవకాశం ఇస్తే రాజన్న సంక్షేమ రాజ్యాన్ని తెస్తానని జగన్మోహన్ రెడ్డి మోసపూరిత మాటలు చెప్పి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. తర్వాత అన్ని సామాజిక వర్గాలకు అధికారాలు ఇస్తానని చెప్పి వృత్తులు, కులాల వారీగా కార్పొరేషన్‌లకు చైర్మన్, పాలక వర్గాలను ఏర్పాటు చేశారన్నారు. ఏడాది గడిచినా ఆయా కార్పొరేషన్‌లకు ఒక్క నయాపైసా కేటాయించకుండా పాలక వర్గాలకు జీతాలు, వాహనాలు ఏర్పాటుచేసి చేతులు దులుపు కున్నారని అన్నారు. మేలు జరుతుందని ఆశించిన చేతి వృతిదారులకు మూడు సంవత్సరాల పాలనలో ఒరిగిందేమీ లేదన్నారు. తక్షణమే జనాభా ప్రాతిపదికన చేతివృత్తులు, కుల వృత్తుల కార్పొరేషన్ లకు నిధులు కేటాయించి వృత్తి దారులకు సబ్సిడీ రుణాలు అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా కార్యక్రమాలు చేపట్టినట్టు పేర్కొన్నారు. ఈ మేరకు కరపత్రాలను విడుదల చేశారు. చేతి వృత్తి దారుల సమాఖ్య కర్నూలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.మాధవస్వామి, ఎం.కారన్న, టైలర్ వృత్తి సంఘం జిల్లా నాయకులు డి.శ్రీనివాసరావు, నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా నాయకులు ఎం.రంగప్ప, ఎం.మద్దిలేటి, చేనేత కార్మిక సంఘం నాయకులు సోమా మోహన్, రజక వృత్తి సంఘం నాయకులు సి.రాజశేఖర్, సి.ఓబులేసు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు ఉపసంహరించుకోండి

- ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి
- నిరసన ప్రదర్శన నేడు

విశాలాంధ్ర-గుంటూరు: కార్మికులను కట్టుబానిస లుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉదయం మల్లయ్యలింగంభవన్ నుంచి హిమనీ సెంటర్‌లోని గాంధీ విగ్రహం వరకు తలపెట్టిన నిరసన ప్రదర్శనలో కార్మికులు, ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొని జయ ప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక మల్లయ్యలింగంభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా జులై 1 నుంచి నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయాలని మోదీ సర్కార్ చూస్తుందని, ఈ కోడ్‌లు అమలు జరిగితే కార్మికవర్గానికి పనిభద్రత, సామాజిక భద్రత ఉండని, సంఘం ఏర్పాటు చేసుకునే హక్కును కోల్పోతారని, శ్రమదోపిడికి గురయ్యే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికవర్గ శ్రేయస్సు, భద్రత కోసమే నాలుగు కోడ్‌లు అని చెబుతున్న కేంద్ర ప్రభుత్వ మాటల్లో వాస్తవం లేదని, కార్పొరేట్‌లకు కార్మికవర్గాన్ని కట్టుబానిసలుగా మార్చే ప్రయత్నం స్పష్టంగా కనబడుతుందన్నారు. రాష్ట్రంలో కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని ఇచ్చిన హామీ అమలు కాలేదన్నారు. హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చిన ఆంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ మేడా హనుమంతరావు మాట్లాడుతూ, నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్రం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు రావుల అంజిబాబు, కోట్ల మరియదాసు పాల్గొన్నారు.

ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఏపీ పాఠశాల స్వీపర్, ఆయాల యూనియన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లు, ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పిం చాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాల స్వీపర్, ఆయాల యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్. వెంకటసుబ్బయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ డిమాండు చేశారు. విజయవాడ గొల్లపూడి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఆ సంఘం అధ్యక్షులు జయకుమారి అధ్యక్షతన గురువారం జరిగిన రాష్ట్ర సమితి సమావేశంలో ఎస్. వెంకట సుబ్బయ్య, రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ... ఆయాలు, స్వీపర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, పాఠశాల యాజమాన్య కమిటీ ప్రమేయం లేకుండా నేరుగా సీపీఎఫ్ ఖాతా నుంచి కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండు చేశారు. రాష్ట్రంలో దాదాపు 45 వేల మంది స్వీపర్లుగా పని చేస్తున్నారనీ, వారికి నెలకు రూ.6 వేల వేతనం ఇస్తున్నారని వివరించారు. స్వీపర్, ఆయాల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.బాల కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం, వారికి చెందిన వారినే స్వీపర్లుగా ఉంచుతామని, మిగిలిన వారిని ఇళ్లకు పంపుతామని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. రాజకీయ జోక్యం లేకుండా వీరిని ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ పరిధిలోకి తీసుకురావాలని, పీఎఫ్, ఈఎస్ఐ ఏర్పాటు చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. 108జీవో ప్రకారం రూ.11, 500 వేతనం ఇవ్వాలని, యూనిఫారంతో పాటు పెండింగు వేతనాలు వెంటనే విడుదల చేయాలన్నారు. లేనిపక్షంలో ప్రభుత్వ పాఠశాల స్వీపర్, ఆయాల యూనియన్ అధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 4వ తేదీ నుంచి 10వరకు మండల, జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, ఆగస్టు 13న చలో విజయవాడకు పిలుపునిస్తామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర శ్రామిక మహిళా విభాగం నాయకురాలు కల్లేపల్లి శైలజ, నాయకులు సునీత, బుజ్జిబాబు, పుల్లారావు, నాగుల్ మీరా, త్యాగరాజు, బోనా, పుల్లమ్మ, లక్ష్మీదేవి, సుంకమ్మ, లాజర్, వివిధ జిల్లా నుంచి సభ్యులు పాల్గొన్నారు.

మోదీ పర్యటన కోసం టీడీపీకి ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 125వ జయంతి వేడుకల కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరుతూ టీడీపీ అధినేత చంద్రబాబుకు కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి లేఖ రాశారు. జులై 4వ తేదీన భీమవరంలో ప్రధాని మోదీ పాల్గొనే అల్లూరి జయంతి కార్యక్రమానికి టీడీపీ నుంచి ప్రతినిధిని పంపాలని కోరారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజును స్మరించుకునే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపిన కిషన్ రెడ్డి, ఆహ్వాన లేఖ రాయడంతో పాటు చంద్రబాబుకు ఫోన్ చేసి పార్టీ నుంచి ప్రతినిధిని పంపాలని కోరారు. అల్లూరి జయంతి వేడుకలకు, భీమవరంలో జరిగే ప్రధాని మోదీ కార్యక్రమం లో చంద్రబాబు సూచనల మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు హాజరు కావాలని నిర్ణయించుకున్నారు.

సచివాలయ ఉద్యోగులకు శుభవార్త

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సచివాలయ ఉద్యోగులకు బుధవారం షాక్ ఇచ్చిన జగన్ సర్కార్ గురువారం శుభవార్త తెలిపింది. ఏపీ సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయాల్లో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు వారానికి ఐదు పని దినాల విధానాన్ని మరో ఏడాది పొడిగించింది. ఈ నెల 27 నుంచి మరో ఏడాది పాటు వారానికి ఐదు పని దినాల విధానం అమల్లో ఉంటుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ గురువారం ఆదేశాలు జారీ చేశారు. సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయాలు, కార్పొరేషన్లలో పనిచేసే ఉద్యోగులతో పాటు అమరావతి రాజధాని ప్రాంతంలోని ఇతర ప్రభుత్వ సంస్థలు ఉదయం 10.00 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పనిచేసే విధంగా వారానికి ఐదు రోజుల పని దినాల విధానం వర్తిస్తుందని ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు.

కవులు, రచయితల వర్క్‌షాప్‌ను జయప్రదం చేయండి

ఏపీ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య

విశాలాంధ్ర - తిరుపతి: సీపీఐ జాతీయ మహాసభల గౌరవార్థం హైదరాబాద్‌లో జరిగే కవులు, రచయితల మూడు రోజుల వర్క్‌షాప్‌ను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య విజ్ఞప్తి చేశారు. గురువారం బైరాగి పట్టెడలోని సీపీఐ కార్యాలయ అవరణలో ఉన్న పిల్లపాలెం వాసుదేవరెడ్డి గ్రంథాలయంలో ప్రజానాట్యమండలి ముఖ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళాకారులకు తగినంత ప్రోత్సాహం, సహకారం ఇవ్వకుండా కళారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని ఆరోపించారు. విష సంస్కృతి వల్ల కళారంగం పూర్తిగా దెబ్బతిందన్నారు. పాట పదునైన ఆయుధం అని, పాట ఎప్పుడూ కష్టజీవుల వైపు, అన్యాయాలను ఎదురొడ్డి నిలిచి ప్రజల్ని జాగృతం చేస్తుందన్నారు. నేడు ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై కవులు, రచయితల కలాలకు పదును పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందుకు తగిన రీతిలో కొత్త కొత్త కళా రూపాలను, నాటికలను తయారు చేసి జనం మధ్య కు తీసుకురావడానికి వర్క్ షాప్ దోహదపడేలా ఉండాలన్నారు. అందులో భాగంగానే రెండు తెలుగు రాష్ట్రాల అరసం, ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో జులై 11 నుంచి 13 వరకు హైదరాబాద్ హిమాయత్ నగర్‌లో ఉన్న సీపీఐ కార్యాలయంలో నిర్వహిస్తున్న వర్క్ షాప్ చాలా ప్రాధాన్యతతో కూడుకున్నదని అన్నారు. ఏపీ ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకుడు మారెళ్ళ శ్రీనివాసులు, తిరుపతి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతా రవి, జింకా నాగరాజు, చిత్తూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంగీతం గుర్రప్ప, మద్దెల సుబ్రమణ్యం, జిల్లా సహాయ కార్యదర్శి పి.గురవయ్య, భజన గురువు వెంకట రమణ పాల్గొన్నారు.

విమానాశ్రయ భూసేకరణ ఏమైంది?

- మంత్రి బొత్స సమాధానం చెప్పాలి
- జీఎంఆర్ పనులు ఎందుకు ప్రారంభించలేదు
- లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ నిలదీత

విశాలాంధ్ర- విజయనగరం క్రైమ్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు ఎందుకు నత్తనడకన జరుగుతున్నాయో, అనుకున్న స్థాయిలో భూసేకరణ ఎందుకు జరగలేదో మంత్రి బొత్స సత్యనారాయణ ప్రజలకు వివరించాలని లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలుగుదేశం ప్రభుత్వం 2015, ఆగస్టు 31న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణానికి నోటిఫికేషన్ విడుదల చేసి 2,622.53 ఎకరాలు భూసేకరణ చేసిందని, ఇందులో 822.55 అస్సైన్డ్ భూమి ఉంటే 416.18 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని, విమానాశ్రయం పరిధిలోని 8 గ్రామాల్లో 4,749 మంది నిర్వాసితులు ఉన్నారని వివరించారు. ప్రారంభంలో ప్రభుత్వం 5,311 ఎకరాలు కావాలని అనుకున్నా తదుపరి రైతుల అభ్యర్థన మేరకు భూసేకరణ తగ్గించారని, ముఖ్యమంత్రిగా చంద్రబాబు 2019 ఎన్నికలకు ముందే శంకుస్థాపన చేసి పనులు ప్రారంభం చేసారని, తదుపరి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అనేకసార్లు సమీక్షలు జరిపి, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ బాధ్యత జీఎంఆర్‌కు ఇచ్చినట్లు ప్రకటించినా నేటికీ పనులు ఎందుకు మొదలుపెట్టలేదని ప్రశ్నించారు.

ప్రభుత్వం అత్యవసరంగా సామాన్య రైతుల మెడపై కత్తి పెట్టి భూసేకరణ చేసిందని, జిల్లా అభివృద్ధి జరగాలని 4,749 మంది నిర్వాసితులు తమ భూములు పంటలతో సహా వదులుకున్నారని, కొంతమంది వైఎస్సార్ పార్టీ నాయకులు తమ భూములు విమానాశ్రయానికి ఎందుకు ఇవ్వలేదని, ఆ పార్టీ వారికి చెందిన సుమారు 37 ఎకరాల భూమిని ప్రభుత్వం ఎందుకు తీసుకోలేదని నిలదీశారు. 8 సంవత్సరాలుగా అదిగో విమానా శ్రయం.. ఇదిగో విమానాశ్రయం అంటున్నారు తప్ప పనులు ప్రారంభం కాలేదని, జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించి మూడు సంవత్సరాలు దాటినా మూడు అడుగులు ముందుకు పడలేదని అసలు తెర వెనుక ఏమి జరుగుతుందో మంత్రి బొత్స జిల్లా ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందని భీశెట్టి అన్నారు.

జిల్లాలో వలసలు: ఉపాధి అవకాశాలు లేక జిల్లా ప్రజలు కుటుంబాలతో వలస వెళ్లిపోతున్నారని, కొత్త పరిశ్రమలు రాకపోగా ఉన్న పరిశ్రమలు మూతపడ్డాయని, యువత నిరుద్యోగంతో అల్లాడుతుంటే వలసలు ఆపవలసిన రాజకీయ పార్టీలు అప్పుడే ఎన్నికల ప్రచారం మొదలు పెట్టేశాయని భీశెట్టి పేర్కొన్నారు. జిల్లా ప్రతినిధి అల్లంశెట్టి నాగభూషణం, జిల్లా క్యాన్సర్ ఆసుపత్రి సాధన సమితి కో కన్వీనర్ ఇప్పలవలస గోపాలరావు, బోర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలు రుజువు చేస్తే

రాజకీయ సన్యాసం

- మాజీ మంత్రి పుష్పశ్రీవాణి
- జులై 11 ఉదయం 11 గంటలకు కురుపాం కూడలి వద్ద చర్చకు సిద్ధం
- టీడీపీ నేతలకు ధీటుగా బదులిచ్చిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర- పార్వతీపురం/ పార్వతీపురం టౌన్: టీడీపీ నేతలు తనపై చేస్తున్న అవినీతి ఆరోపణలు రుజువు చేస్తే తాను రాజకీయాలకు స్వస్తి చెబుతానని, ఇప్పటికీ పలుమార్లు తాను చర్చలకు సిద్ధమని చెప్పినా టీడీపీ నేతలు స్పందించలేదని మాజీమంత్రి, వైఎస్సార్సీపీ పార్వతీపురం మన్యంజిల్లా అధ్యక్షురాలు, కురుపాం శాసనసభ్యులు పాముల పుష్పశ్రీవాణి అన్నారు. గురువారం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో జరిగిన వైఎస్సార్సీపీ ప్లీనరీలో ఆమె ఆవేశపూరితంగా మాట్లాడారు. జులై 11 ఉదయం 11గంటలకు కురుపాంలోని రావాడ కూడలి వద్దకు తాను వస్తానని, టీడీపీ నేతలు కూడా రావాలని సవాల్ విసిరారు. అక్రమ ఆస్తులు తాను సంపాదించినట్లు ఇటీవల కాలంలో టీడీపీ నేతలు పలుమార్లు చేస్తున్న ఆరోపణలకు ధీటుగా బదులిచ్చారు. 'ఈ సభసాక్షిగా, ఇక్కడున్న అందరి సాక్షిగా చెప్పేది ఏమిటంటే.. నేను నాసైన్యంతో తరలివస్తాను మీరు కూడా మీసైన్యంతో వచ్చి నాపై చేసిన అవినీతి ఆరోపణలు రుజువు చేస్తే రాజకీయ సన్యాసం చేస్తానని' ప్రకటించారు. ఇటీవల ఆమె అవినీతికి పాల్పడినట్లు టీడీపీ నేతలతో పాటు ఆమె మామ, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ శత్రుచర్ల విజయరామరాజు, ఆమె ఆడపడుచు శత్రుచర్ల పల్లవిరాజు ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే.

అక్కడే ఉన్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, ఉత్తరాంధ్ర వైఎస్సార్సీపీ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ స్పందిస్తూ.. టీడీపీ నేతల ఆరోపణలకు స్పందించాల్సిన అవసరం లేదని అన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ఇటువంటి చౌకబారు ఆరోపణలు చేయడం టీడీపీ నేతలకు అలవాటేనని మంత్రి రాజన్నదొర అన్నారు.

వాణిజ్య ఉపగ్రహ ప్రయోగాలకు సిద్ధం

ఇస్రో చైర్మన్

విశాలాంధ్రబ్యూరో-నెల్లూరు: భవిష్యత్తులో మరిన్ని ప్రయోగాలకు తాము సిద్ధమని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ చైర్మన్ సోమనాథ్ చెప్పారు. వ్యాపార ఉపగ్రహాలను సైతం ప్రయోగించేందుకు వెనుకాడేది లేదని చెప్పారు. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్‌లో గురువారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ భవిష్యత్తులో మనుషులను కూడా ఇస్రో అంతరిక్షంలోకి పంపడానికి చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రపంచంలో మరే ఇతర దేశాలతో పోల్చినా ఇస్రో అగ్రస్థానంలోనే ఉంటుందని ఆయన అన్నారు. ఈ ఏడాది ఇస్రో మరిన్ని ప్రయోగాలకు ప్రణాళికలు రచిస్తోందన్నారు.

అవినీతి తిమింగలం

- ఏసీబీ వలలో కార్పొరేషన్ ఎస్ఈ
- కాంట్రాక్టర్ నుంచి రూ.15 లక్షల డిమాండ్
- లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: కర్నూలు నగర పాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజనీర్ కే సురేంద్ర బాబు రూ.15 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. అమృత్ పథకం కింద కాంట్రాక్టర్ శ్రీనివాసులు రెడ్డి చేసిన పనులకు బిల్లు మంజూరు చేయడానికి ఇంజనీరు 15 లక్షలు డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. గురువారం కర్నూలులోని కృష్ణనగర్ ఉపరితల వంతెన వద్ద డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. కర్నూలు కార్పొరేషన్ పరిధిలో మొత్తం 51 డివిజన్లు ఉన్నాయి. ఇందులో నియోజక వర్గంలో 35, పాణ్యం 13, కోడుమూరు నియోజక వర్గ పరిధిలో 3 డివిజన్లు ఉన్నాయి. ఈ డివిజన్లలో లక్షా 10 వేల ఇళ్లు ఉన్నాయి. కుళాయి కనెక్షన్లు మాత్రం 48,000 ఉన్నాయి. దీంతో మిగిలిన వారందరికీ ఉచితంగా కుళాయి కనెక్షన్లు మంజూరు చేసి మంచినీరు అందించాలనే లక్ష్యంతో 2016 నవంబర్ 5న అమృత్ పథకాన్ని ప్రారంభించారు. ఈ పనులకు సంబంధించి మొత్తం రూ.58.25 కోట్లు ఖర్చు చేశారు. అయితే కోటి 52 లక్షలు చివరి బిల్లు మంజూరు చేయకుండా ఎస్ఈ జాప్యం చేయడంతో కాంట్రాక్టర్ శ్రీనివాసరెడ్డి తెచ్చిన అప్పుకు వడ్డీ చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చివరకు విసుగెత్తి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. రూ. 1.52 కోట్ల బిల్లు మంజూరు కోసం ఎస్ఈ సురేంద్రబాబు రూ.15 లక్షలు డిమాండ్ చేశారని ఏసీబీ డీఎస్పీ శివ నారాయణ స్వామి తెలిపారు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. దాడుల్లో ఏసీబీ సీఐలు తేజేశ్వరరావ్, ఇంతియాజ్ పాల్గొన్నారు.



'వీఐటీ' ప్రవేశ పరీక్ష ప్రారంభం

- ప్రపంచవ్యాప్తంగా 119 పరీక్షా కేంద్రాలు
- హాజరుకానున్న లక్షా 86వేల మంది విద్యార్థులు
- 8న ఫలితాలు విడుదల: వీసీ కోటారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ (వీఐటీ) ప్రవేశ పరీక్ష గురువారం ప్రారంభమైంది. 2022-23 విద్యా సంవత్సరానికి గాను వెల్లూరు, చెన్నై, అమరావతి (ఆంధ్రప్రదేశ్), భోపాల్ విశ్వవిద్యాలయాల్లోని బీ టెక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఉమ్మడిగా నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 119 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్ష జరుగనుంది. మొత్తం 1.86 లక్షల విద్యార్థులు ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షకు హాజరు కానున్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలతోపాటు దుబాయ్, ఖతార్, మస్కట్, కువైట్‌లలో కూడా పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయబడ్డాయి. దేశంలో దాదాపు ప్రతి రాష్ట్రం నుంచి వేలాది మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష కోసం నమోదు చేసుకున్నారు. అమరావతిలోని వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ప్రవేశ పరీక్షను వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.వి. కోటా రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ ముదుగంటి జగదీష్, అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ కె.మణివణ్ణన్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 30న ఆన్‌లైన్‌లో ప్రారంభమైన ఈ ప్రవేశ పరీక్షలు జులై 6వ తేదీ వరకు కొనసాగుతాయని, ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 3.00 గంటల వరకు, సాయంత్రం 4.00 గంటల నుంచి 6.30 గంటల వరకు మూడు సెషన్లలో పరీక్ష ఉంటుందని తెలిపారు. జులై 8వ తేదీ ప్రవేశ పరీక్షా ఫలితాలు వెల్లడిస్తామని, వీఐటీ వెబ్ సైట్‌లో ఉంచుతామని తెలిపారు.

సంపాదకీయం

తెరతీయక ముందే ముగిసిన నాటకం

మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉద్ధవ్ ఠాక్రే పాలన రెండున్నరేళ్ల లోనే ముగిసింది. గవర్నర్ ఆదేశించినట్టుగా గురువారం శాసనసభా వేదిక మీద విశ్వాస ప్రకటన జరగక ముందే ముఖ్యమంత్రి బుధ వారం రాత్రే రాజీనామా చేశారు. ఏక్‌నాథ్ షిందే కొత్త ముఖ్య మంత్రి అయిపోయారు. దేవేంద్ర ఫడ్నవీస్ ఉప ముఖ్యమంత్రి అయ్యారు. మహారాష్ట్రలో ఎలాగైనా సరే తమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్న బీజేపీ పథకం సఫలమైంది. దీనికి శివసేన తిరుగు బాటుదారు నాయకుడు ఏక్‌నాథ్ షిందే దాదాపు 50 మంది శాసన సభ్యుల మద్దతుతో రంగం సిద్ధం చేశారు. ఆయనను ముందుంచి బీజేపీ ఆడించిన నాటకం రక్తి కట్టింది. ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వం అయిదేళ్లు మనగలుగుతుందన్న భరోసా ముందు నుంచే ఎవరికీ లేదు. 2019 ఎన్నికలలో ఏ రాజకీయ పార్టీకి మెజారిటీ రాలేదు. 106 సీట్లతో బీజేపీ అతి పెద్ద పార్టీగా అవతరించింది. బీజేపీ, శివసేన పార్టీలకు హిందుత్వంపై ప్రగాఢ విశ్వాసం ఉన్నప్పటికీ కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి శ్రుతి కుదరలేదు. అందుకే నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ అధినేత శరద్ పవార్ చాకచక్యంవల్ల కాంగ్రెస్, శివసేన, నేషనలిస్టు కాంగ్రెస్ కలిసి మహా వికాస్ అగాఢీ పేర కూటమికట్టి ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగాయి. అసలు ఈ మూడు పార్టీల కలయికే ఆ పార్టీల స్వభావానికి పూర్తిగా భిన్నమైంది. అధికారం కోసం ఏకమయ్యాయి. కేంద్రంలోనే కాక అన్ని రాష్ట్రాలలోనూ తమ ప్రభుత్వాలే ఉండాలన్నది బీజేపీ పంతం. రాష్ట్రాలలో మెజారిటీ సంపాదించగలిగిన చోట ఎటూ బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. మెజారిటీ లేని చోట్ల కూడా సామదానభేద దండోపాయాలకే పరిమితం కాకుండా అపారమైన ధన రాశులను గుమ్మ రించి అధికారం సంపాదించే కళలో బీజేపీ అనితరసాధ్యమైన కౌశలం ప్రద ర్శిస్తోంది. ఈ పద్ధతిలోనే పూర్తి మెజారిటీ లేకపోయినా కర్నాటక, మధ్య ప్రదేశ్, గోవాలో బీజేపీ అధికారం చెలాయించగలుగుతోంది. మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలో మహా వికాస్ అగాఢీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచీ ఆ సర్కారును ఎలా పడగొట్టాలన్న కుతంత్రాలు బీజేపీ పన్నుతూనే ఉంది. చివరకు బుధవారం సఫలమైంది. శివసేనలో తిరుగుబాటు రెచ్చ గొట్టి అధికార నిచ్చెనలో ఉద్ధవ్ ఠాక్రే తరవాతి స్థానంలో ఉన్న ఏక్ నాథ్ షిందేను ప్రేరేపించి కాగల కార్యం సాధించింది. ఈ తిరుగుబాటు సందర్భంగా ఏక్ నాథ్ షిందే శివసేన, కాంగ్రెస్, నేషనలిస్టు కాంగ్రెస్ కలయిక అపవిత్రమైందని అంటూనే ఉన్నారు. ఈ మాట వెనక దురుద్దే శాలు ఏమైనప్పటికీ ఆ మాట నిజమే. ఎంతకాదన్నా కాంగ్రెస్, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీలకు సెక్యులర్ స్వభావం ఉంది. ఆ ధోరణి బొత్తిగా లేని శివసేనను కలిపి కూటమి ఏర్పాటు చేయడంలో శరద్ పవార్ వ్యూహం ఫలించి రెండున్నరేళ్లు ప్రభుత్వం కొనసాగింది. ఈ క్రమంలో శివసేన మతతత్వ ధోరణి మందగించింది. ప్రజాస్వామ్య ప్రక్రియను విశ్వసించడం మొదలైంది. ఇది శివసేన అసలు స్వరూపం కాదనీ, బాలాసాహెబ్ ఠాక్రే నెలకొల్పిన శివసేన ఇది కాదని ఏక్ నాథ్ షిందే కొత్త రాగం ఎత్తుకున్నారు. సరే కాంగ్రెస్, నేషనలిస్ట్ కాంగ్రెస్ కూటమిని రద్దు చేసుకుంటాం అని ఉద్ధవ్ ఠాక్రే ఆహ్వానించినా ఏక్ నాథ్ షిందే శిబిరం వెనుదిరగలేదు. చిచ్చు పెట్టడం మేరకే షిందే స్వతంత్రంగా వ్యవహరించారేమోగానీ ఆ తరవాత ఆడిస్తున్నది బీజేపీ కనక వెనక్కు తగ్గలేకపోయారు. బీజేపీ ఆడించిన నాటకంలో షిందే పావు మాత్రమే. మన ప్రజాస్వామ్యం తలలు లెక్కించ డానికి పరిమితమై పోయినందువల్ల ఆ తలల పిలకలు ఎవరి చేతిలో ఉన్నా యన్నది ప్రధానం. అత్యధిక సంఖ్యాక శాసనసభ్యులు షిందే పక్షాన చేరడంతో ప్రభుత్వ పతనంతో కథ ముగియలేదు. శివసేనపై ఇక ముందు ఆధిపత్యం ఎవరిది అన్న ప్రశ్న ఇప్పుడే మొదలైంది. ఉద్ధవ్ ఠాక్రే చేతిలో శివసేన మిగులుతుందా అన్న అనుమానం బలపడుతోంది. షిందే తాను ముఖ్యమంత్రి అయ్యే ఉద్దేశంతో తిరుగుబాటు చేయలేదు. అయినా పదవి ఆయననే వరించింది. తిరుగుబాటు ఫలితాలను బీజేపీకి తాకట్టు పెట్టారు. షిందేకు కావలసింది శివసేన, ఆ పార్టీ ఆస్తులు, సాధన సంపత్తి మీద పెత్తనం. సామాన్య కార్యకర్తల మద్దతు ఇప్పటికీ ఉద్ధవ్ ఠాక్రేకే ఉందని ఇటీవల ముంబైతో సహా అనేక చోట్ల జరిగిన ప్రదర్శనలు నిరూపించాయి. ఈ ప్రజాబలాన్ని ఉద్ధవ్ ఎంత కాలం నిలబెట్టుకోగలరు, మళ్లీ పార్టీని బలో పేతం చేయగలరా అన్నది అసలు ప్రశ్న. ఆయన అధికారం కోల్పోవడం కన్నా శివసేన భవిష్యత్తే ప్రస్తుతం చర్చనీయాంశం అయింది. బాలాసాహెబ్ నుంచి అప్పనంగా శివసేన నాయకత్వం ఉద్ధవ్ ఠాక్రేకు సంక్రమించింది తప్ప తండ్రికి ఉన్న వ్యూహ రచనా నైపుణ్యం, ప్రజలను గుప్పెట్లో పెట్టుకో గలిగిన శక్తి, అవసరమైనప్పుడు వారిని రెచ్చగొట్టగలిగిన సామర్థ్యం ఉద్ధవ్ ఠాక్రేకు లేవు. ఠాక్రే సర్కారు కొనసాగడమో, పతనం కావడానికో పరిమిత మైన వ్యవహారం కాదిది. షిందే వర్గం కనక శివసేన మీద ఆధిపత్యం చెలా యిస్తే శివసేన ప్రధాన కార్యాలయం, నిధులు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతా లలో ఉన్న శివసేన ఆస్తులు మొదలైనవన్నీ షిందే వర్గానికి దక్కుతాయి. మాదే అసలైన శివసేన అని షిందే ఇప్పటికే వాదిస్తున్నారు. ఎవరిదో అంతి మంగా తేల్చాల్సింది ఎన్నికల కమిషన్. శివసేన షిందే వర్గానికి దక్కినా ఆయన, ఆయన మద్దతుదార్లు బీజేపీ ఆడించినట్టల్లా ఆడిన వారే కనక చివరిసారి పాచిక వేసే అవకాశం బీజేపీ గుప్పెట్లోనే ఉంటుంది.

ఉద్ధవ్ ఠాక్రే శివసేన వ్యవస్థాపకుడు బాల్ ఠాక్రే కుమారుడే అయి ఉండొచ్చు. బాలాసాహెబ్ ఠాక్రేకు రాజకీయాలకు తోడు కార్టూన్లు వేయడం, రచనలు చేయడం లాంటి కళాదృష్టి ఉండేది. ఉద్ధవ్ ఠాక్రేకూ ఫొటోలు తీయడంలో అభినివేశం ఉంది. కానీ తండ్రికి ఉన్న సాహసం కానీ, వ్యూహరచనా నైపుణ్యం కానీ ఉద్ధవ్‌కు అబ్బనే లేదు. 2019లో జరిగిన మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల తరవాతి పరిణామాల కారణంగా ఉద్ధవ్ ముఖ్యమంత్రి అయ్యారు తప్ప రాజకీయ నాయకుడికి ఉండవలసిన లక్షణాలు ఆయనకు బొత్తిగా లేవు. మహారాష్ట్ర వ్యవహారంతో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదనడం హాస్యాస్పదం. తిరుగుబాటుదారు శాసనసభ్యులను మొదట గుజరాత్‌లోని సూరత్ తీసుకెళ్లారు. అక్కడి నుంచి అసోం తీసుకెళ్లారు. ఆ తరవాత 29వ తేదీకల్లా గోవా వచ్చారు. ఈ మూడురాష్ట్రాలూ బీజేపీ పాలనలోనే ఉన్నాయి. అసోం ముఖ్యమంత్రి తిరుగుబాటుదారు ఎమ్మెల్యే లకు వసతి తదితర వ్యవహారాలను స్వయంగా పరిశీలించారు. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు తిరుగుబాటుదార్లకు సకల విధ సదుపాయాలు కలగజేయడంలో నిమగ్నమై ఉన్నాయి. ముంబై చేరిన ఎమ్మెల్యేల వెంట అసోం మంత్రి ఉన్నారు. ఇవన్నీ బీజేపీ వాదనలోని డొల్లతనాన్ని రుజువు చేస్తున్నాయి. అసోం ప్రభుత్వ బస్సులే వినియోగించారు. బీజేపీ ఆడే లేదా ఆడించే నాటకాలకు రంగస్థలం అక్కర్లేదు. తెర తీయకముందే నాటకం ముగించే సత్తా ఆ పార్టీకి ఉంది.

ప్రధాని మోదీ నిర్దోషా

బండారు రాధాకృష్ణ

రా బావా! ఏంటి కబుర్లు. ఎండలు తగ్గినవి కదా యిక వారానికి ఒక రోజైనా రావచ్చు. వస్తాను బావా. మీరంటే నా కంటే పెద్దవారు కదా నడవలేరు. నేనే వస్తాను. అది సరే. ఈ రోజు ఏ కబుర్లు తెచ్చావు. ఏముంది బావా పేపరు చూసిన దగ్గర్నుంచి నా మనసు కుతకుతలాడి పోతోందనుకో. ఎందుకు బావా అంతటి ఘోరమైన వార్త ఏముంది. అదేంటి బావా అలా అంటావు. ఆ రోజు అంటే 2002లో గుజరాత్‌లో వందల మంది ముస్లింల ఊచకోతకు కారకుడు నరేంద్ర మోదీ అని వార్తాపత్రికలు అన్నీ గగ్గోలు పెట్టాయి కదా. యిప్పుడు మోదీ నిర్దోషిగా కోర్టు తీర్పు ఏంటి బావా? మామూలుగా హత్యలు చేసిన వారితో పాటు కుట్రలు పన్నిన వారు, ప్రోత్సహించిన వారు సమానమైన శిక్షార్హులే అని ఎన్నో తీర్పులిచ్చిన కోర్టు ఈ రోజు నిర్దోషి అంటే నా మనసు బాధపడుతోంది బావా.

ఓ పిచ్చి బావా ఈ మధ్య తీర్పులివ్వడంలో కూడ ఒక కోర్టుకు మరో కోర్టుకు సంబంధం ఉండటం లేదు కదా. అంటే తప్పు చేసిన వాడి హోదాను బట్టి తీర్పు ఉంటుందా బావా. అదేకాదు బావా కొన్ని సందర్భాలలో న్యాయమూర్తి అంతరాత్మను బట్టి కూడ తీర్పులు యివ్వవచ్చట. పాపం ఒక



పత్రిక సంపాదకుడు ఈ తీర్పు తరవాత 90 శాతం వికలాంగుడయిన ప్రొఫెసర్ సాయిబాబాకు కనీసం బెయిలు కూడ ఇవ్వని కోర్టుకు మోదీ నిర్దోషిగా కనబడటంపై ఆవేదన వెలిబుచ్చారు. బావా యింకో వార్త నాకు విస్మయం కలిగిస్తోంది. అదేమంటే నిన్నగాక మొన్న జర్మనీలో మాట్లాడుతూ ప్రజాస్వామ్యం భారతీయుల రక్తంలోనే ఉందని తన దేశం అసలైన సిసలైన ప్రజాస్వామ్య దేశంగా మాట్లాడారు. యిది ఎంత ఘోరమైన అబద్ధం. నీ దృష్టిలో అబద్ధం, ఆయన దృష్టిలో నిజం. అసలు కరుడుగట్టిన హిందూత్వ భావజాలంతో రెచ్చిపోయే ఆర్.ఎస్.ఎస్ నుండి వచ్చిన మోదీ మతతత్వ పార్టీ అయిన బీజేపీలో చేరి తన వాక్ చాతుర్యంతో మాటల మాంత్రికుడిగా పేరొంది గుజరాత్ ముఖ్యమంత్రి అయి ప్రస్తుతం ప్రధాని అయ్యాడంటే మంచికో, చెడుకో ఆయన్ని తెలివికలవాడనాల్సి వస్తోంది.

అందుకేనేమో బావా ఆ మధ్య పాపం యూనివర్సిటీలో చదువుకునే కుర్రాడు కన్హయ కుమార్ హిందూత్వ మతతత్వ భావజాలానికి ఎదురు తిరిగి అనేక యిబ్బందులు పడ్డాడు. మన విజయవాడ వచ్చినప్పుడు కూడా పాపం అతన్ని కాపాడటానికి కమ్యూనిస్టులు కృషి చేశారు. అతను ఏమన్నాడంటే మీ భారతమాత వేరు, మా మాత వేరన్నాడు. అందుకే మీరు మమ్మల్ని దూరంగా పెట్టినా కేసుల్లో యిరికించి చిత్రహింసలు పెట్టినా మీ మాత పట్టించుకోదని ఆవేదన వ్యక్తం చేశాడు కదా బావా. అది సరే బావా మోదీ అసలైన ప్రజాస్వామ్య వాదినని ఇతర దేశాల్లో ఊదరగొడుతున్నాడు కదా. మరి మొన్న గోవాలో ఏం చేశాడు. గతంలో త్రిపురలో యిపుడు మహారాష్ట్రలో ప్రభుత్వాలను పడగొట్టే ప్రయత్నాలేంటి.

బావా గతంలో హరిదాసులు చెప్పేవన్నీ వినేవారికే గాని తమకు కాదనేవారట. అలాగే నియంతలుగా మారిన నాయకులే అసలైన ప్రజా స్వామ్యవాదులుగా చెలామణి అవుతున్నారు. అయినా ప్రశ్నించిన వారిని లక్ష్యంగా పెట్టుకొనే నాయకుడికి ఈ అబద్ధాలు ఒక లెక్కకాదు. అన్నింటి కంటే ప్రమాదమైనది మతతత్వం కదా. అవును బావా మనది సెంటిమెంటు ఎక్కువగా ఉన్న దేశం. 99 శాతం ప్రజలు కనపడని దేవుణ్ణి నమ్ముతారు. కనుక దైవారాధన పేరుతో గుళ్లు, గోపురాలు పెంచి ప్రజల్ని మూఢ నమ్మ కాల్లో ముంచి వారి పబ్బం గడుపుకొని అధికార పీఠంపై కూర్చుంటున్నారు. నువ్వు మరిచావేమో ఒకప్పుడు మూఢ నమ్మకాలు మంచిది కాదు శాస్త్రీయంగా ఆలోచించమన్న కమ్యూనిస్టులపై నాస్తిక ముద్ర వేసి ఓట్లు వేయించుకున్న కాంగ్రెసు సంగతి తెల్సుకదా. అంతేకాదు బావా నక్సలైట్లు యిచ్చిన ఇంక్విలాబ్ జిందాబాద్ అనే స్లోగను ఇందిరాగాంధీ యిచ్చి అంద రినీ ఆశ్చర్యంలో ముంచివేసింది. అంతేకాదు బావా కోర్టు తీర్పు రాగానే హోంమంత్రి అమిత్ షా ప్రధాని మోదీ గరళ కంఠుడు అన్నారు. పాపం ప్రతిపక్షాలు ఎన్నిసార్లు మోదీ కంఠంలో గరళం పోశాయో మరి. అది సరే ఏదైనా పరవాలేదుగాని మతతత్వ పార్టీలుండటం సహించరాదని మనిషి బానిస బతుకే బతకాలని మార్చు మతం మత్తుమందు లాంటిదని అంటారు గదా. బీజేపీ, బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్ని కుయుక్తు లతో పార్టీలలో చీలిక తెచ్చి పడగొడుతున్నాయి కదా. యిప్పుడేం చేయాలి.

అసలు మేం ఉండగా యింకో పార్టీ ఎందుకు అనే ఆలోచన బీజేపీది. ఆ మధ్య చంద్రబాబు కూడ ఆ స్లోగను అందిపుచ్చుకున్నాడు. మరి ఏం చేయాలి బావా. ఒకసారి 60 ఏళ్ళు వెనక్కి వెళ్లి ఆలోచించు బావా. ఆనాటి కమ్యూనిస్టులు ప్రజల్లో చైతన్యం తేవడానికి క్యాడరుకు క్లాసులు నడిపారు. చదువులేని వారికి రాత్రుళ్లు రాత్రి పాఠశాలలు నడిపారు. అవన్నీ యిప్పుడు సాధ్యమేనా బావా. తలుచుకుంటే అసాధ్యమేదీ కాదు. మతతత్వ పార్టీ ఏలుబడిలో బానిస బతుకు బతకటం కంటే వారిని గద్దె దించడానికి ఏదో ఒకటి చేయాలి కదా. అవును బావా మోదీ, అమిత్‌షాలు రాజు, మంత్రిగా పాలన సాగిస్తూ రాజుల పాలన గుర్తు చేస్తున్నారు. అవును బావా దేవాలయాలు పడగొట్టి, మసీదులు కట్టారంటారు. కాని బుద్ధుని ఆరామాలు పడగొట్టి దేవాలయాలు కట్టిందెవరో చెప్పరు. ఏది ఏమైనా అప్రజాస్వామ్య నియంత పాలనకు స్వస్తి పలకాలి. ఇందుకు వామపక్షాలు నడుం బిగించ వలసిన అవసరం ఎంతైనా ఉంది. సరే బావా నే వెడతాను యిక.

వ్యాస రచయిత సీనియరు జర్నలిస్టు

న్యాయవ్యవస్థలో భూస్వామ్య సంస్కృతి?

చెరుకూరి సత్యనారాయణ

హైకోర్టుల్లో వాదనలు వినిపించే సమయంలో న్యాయవాదులు మిలార్డ్ (నా ప్రభువా) అని, కింద కోర్టుల్లో "యువరానర్" (ఘనమైన అయ్యా) అని సంబోధిస్తారనే విషయం అందరికీ తెల్సు. న్యాయవాదులు ఎప్పుడైనా హైకోర్టుకెళ్లి వాదించే సమయంలో "మిలార్డ్"కి బదులు "యువరానర్" అని సంభోదిస్తే చాలామంది న్యాయమూర్తులు మొఖం చిట్లించుకోవటం గమనిస్తున్నాం. అంటే ఈ వలసవాద పద్ధతులు చట్ట సవరణల ద్వారా కంటే పై కోర్టుల న్యాయమూర్తుల ఆలోచనా ధోరణిలో మార్పు రావటం వలన పోవాలి. ఎవరో ఒక జస్టిస్ చంద్రు లాంటివారు పూనుకుంటే చాలదు. ఈ మార్పు ఇంకా విస్తృతంగా రావాలి.

తమకు వ్యతిరేక తీర్పులు వస్తున్నందుకు ఆ మధ్య వై.సి.పి ప్రభుత్వ అనుకూలురైన కొందరు వ్యక్తులు న్యాయమూర్తుల్ని అసభ్య పదజాలంతో నిందిస్తూ సోషల్ మీడియా వేదికగా తెగబడినప్పుడు హైకోర్టు వారు సి.బి.ఐ విచారణకు ఆదేశిస్తూ, ఆ నిందితులు న్యాయవ్యవస్థ ప్రతిష్ఠని దిగజారుస్తున్నారని వ్యాఖ్యానించింది. అది నిజమేగాని న్యాయవ్యవస్థ స్వయంకృత కారణాలతో తన ప్రతిష్ఠని మసకబార్చుకుంటున్న మరో కారణం కూడా ఉంది. అదే సబార్డినేషన్. చాలామంది మేధావులు, ప్రజలు సబార్డినేషన్ అతి ఎక్కువగా పోలీసు వ్యవస్థలో వుందని భావిస్తారు. కాని న్యాయవ్యవస్థలో వున్న సబార్డినేషన్ పోలీసు వ్యవస్థకి ఏ మాత్రం తీసిపోదు. వలస పాలకుల నుండి సంక్రమించిన ఈ అక్రమ వ్యవస్థ అన్ని విషయాల్లోనూ స్వతంత్ర దేశంలోనూ కొనసాగటం విచారకరం. చాలామంది ఈ సబార్డినేషన్ వ్యవహారాన్ని ఫ్యూడల్ ధోరణిగా అభివర్ణిస్తారు. నిజానికిది బానిస వ్యవస్థ అవశేషం.

ఈ మధ్య విశ్రాంత జిల్లా జడ్జి మంగారి రాజేందర్ పెట్టిన పోస్టు చూశాను. అందులో "5 కిలోమీటర్ల దూరంలో నిల్చుని హైకోర్టు జడ్జికి ఆహ్వానం పలికి రమ్మని జిల్లా జడ్జి ఒక మేజిస్ట్రేట్‌కి చెబితే, ఆయన నిరాకరించి నేను సుంకరిని కాదని" జవాబిచ్చాడట. ఇలా సబార్డినేషన్‌ని ధిక్కరించిన కిందస్థాయి న్యాయాధి కారులున్నట్లే, కిందస్థాయి న్యాయాధికారుల్ని సమంగా గౌరవించే హైకోర్టు న్యాయమూర్తులు కూడా తగు సంఖ్యలో వున్నారు. జస్టిస్ చంద్రు పదవీ విరమణ రోజు ముందుగా తన కారు డ్రైవర్‌కి, తన దగ్గర పనిచేసే డఫేదారుకి కృతజ్ఞతలు తెలియజేసి నడుచుకుంటూ ఇంటికెళ్లిన ఉదంతాన్ని మనం పత్రికల్లో చూశాం.

మా గుంటూరు జిల్లా గురజాలలో 80వ దశకం చివరిలో సూర్యారెడ్డి అనే మేజిస్ట్రేట్ వుండేవాడు. ఒకసారి జిల్లా జడ్జి అతణ్ణి గుంటూరు రమ్మని కబురు చేస్తే "నాకు గుంటూరులో పనేమీ లేదు. నాతో పనివుంటే మీరే గురజాల రండి" అని సమాధానం ఇచ్చాడు. పూర్వం రాజులు ధర్మగంట పెట్టినట్లు అతనూ ఇంటిదగ్గర ధర్మగంట పెట్టి అర్ధరాత్రి అపరాత్రి వచ్చి గంట కొట్టిన న్యాయార్థులకు న్యాయ సహాయం చేశాడు. ఫలితంగా అతని సహచరులంతా జిల్లా జడ్జిలుగా పదోన్నతి పొందినా ఆయన సంవత్సరాల తరబడి ప్రమోషన్ లేకుండా మేజిస్ట్రేట్‌గానే కొనసాగాడు.

"భారత న్యాయ వ్యవస్థలో భూస్వామ్య ధోరణులు నేటికీ ఉన్నాయన్న విషయం మనకందరికీ తెల్సు. జిల్లా న్యాయమూర్తులతో ఇతర న్యాయ మూర్తులతో మనం వ్యవహరిస్తున్న తీరులో ఈ ధోరణి కన్పిస్తుంది. జిల్లా కోర్టు న్యాయమూర్తులు పై కోర్టు న్యాయమూర్తుల కోసం పడిగాపులు పడడం, వారు హైకోర్టు న్యాయమూర్తులతో మాట్లాడేటప్పుడు కూర్చోకపోవడం సబార్డినేషన్‌కి గుర్తులు. ఈ భూస్వామ్య సంస్కృతికి వ్యతిరేకంగా న్యాయమూర్తులు, న్యాయ వాదులు మాట్లాడాల్సిన సమయం ఆసన్నమైంది"... ఇవి ఇంకొద్ది రోజుల్లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కాబోతున్న వై.వి.చంద్రచూడ్ గుజరాత్ హైకోర్టులో జరిగిన ఒక సమావేశంలో అన్న మాటలు. అత్యంత దురదృష్ట కరమైన విషయం ఏమంటే ఎంతో ముందుచూపు, స్వతంత్ర పిపాస, ఆత్మగౌరవ అభిలాష కల్గిన మేధావుల సమూహం తయారుచేసిన మన రాజ్యాంగం ఆరవ అధ్యాయంలో "సబార్డినేట్ కోర్టులు" అనే మాట వుంది. 30 ఏళ్ళ క్రితం మేజిస్ట్రేట్‌కి జిల్లా జడ్జికి మధ్య "సబార్డినేట్ జడ్జి" వుండేవాడు. ఈ పదబంధం ఇష్టం లేక న్యాయశాఖలో, మన రాష్ట్రంలో ఈ జడ్జిని సబ్-జడ్జి అని వ్యవహ రించేవారు. ఇటీవల మన రాష్ట్రంలో ఈ కోర్టుని సీనియర్ సివిల్‌జడ్జి కోర్టు అని పిలుస్తున్నారు. ప్రమాదకరమైన అసంగతమైన ఈ సబార్డినేట్ అనే పదం ఫ్యూడల్ వ్యవస్థ అవశేషాల్ని ప్రతిఫలిస్తుంది. ఈ పదబంధాన్ని వ్యతిరేకిస్తూ ప్రొఫెసర్ భక్షి లాంటి వారు తరచూ మాట్లాడేవారు.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 235 ప్రకారం మొత్తం సబార్డినేట్ కోర్టులు ఆయా రాష్ట్రాల హైకోర్టు పర్యవేక్షణలోనూ, నియంత్రణలోనూ వుంటాయి. అంత మాత్రాన పై న్యాయమూర్తులకంటే కిందస్థాయి న్యాయమూర్తులు తక్కువ కాదు. కింద కోర్టుల్లో న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పుల్ని తమ ముందుకు అప్పీలు రూపంలోనో రివిజన్ రూపంలోనో వచ్చినప్పుడు ఆయా తీర్పుల్లో పై కోర్టులు జోక్యం చేసుకోగలవే తప్ప, అత్యంత కిందస్థాయి సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో తీర్పుల్నికూడా భారతదేశ ప్రధాన న్యాయమూర్తి సైతం ప్రభావితం చేయజాలడు.

ప్రిన్సిపల్ న్యాయమూర్తులు కూడా అదనపు న్యాయమూర్తులకు అధిపతులు కారు. మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన సంజీవ్ బెనర్జి తన వీడ్కోలు సభలో న్యాయవ్యవస్థలో నెలకొన్న ఈ ఫ్యూడల్ సంస్కృతిని నాశనం చేయనందుకు బాధపడుతున్నానని వ్యథ చెందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్ లాంటి రాష్ట్రాలలో సబార్డినేట్ అనే పదాన్ని ఎత్తేశారు.

హైకోర్టుల్లో వాదనలు వినిపించే సమయంలో న్యాయవాదులు మిలార్డ్ (నా ప్రభువా) అని, కింద కోర్టుల్లో "యువరానర్" (ఘనమైన అయ్యా) అని సంబో ధిస్తారనే విషయం అందరికీ తెల్సు. న్యాయవాదులు ఎప్పుడైనా హైకోర్టుకెళ్లి వాదించే సమయంలో "మిలార్డ్"కి బదులు "యువరానర్" అని సంభోదిస్తే చాలామంది న్యాయమూర్తులు మొఖం చిట్లించుకోవటం గమనిస్తున్నాం. అంటే ఈ వలసవాద పద్ధతులు చట్ట సవరణల ద్వారా కంటే పై కోర్టుల న్యాయ మూర్తుల ఆలోచనా ధోరణిలో మార్పు రావటం వలన పోవాలి. ఎవరో ఒక జస్టిస్ చంద్రు లాంటివారు పూనుకుంటే చాలదు. ఈ మార్పు ఇంకా విస్తృతంగా రావాలి. జస్టిస్ రంగనాథ మిశ్రా భారత ప్రధాన న్యాయమూర్తిగా వున్నకాలంలో గుంటూరు సమీపంలో వుండే స్వామీజీని దర్శించుకోవటానికి వచ్చారు. ఆయన వెంట వెళ్లవలసిందిగా అప్పటి జిల్లా జడ్జి కూనె మోహనరావుకి హైకోర్టు నుండి మౌఖికంగా చెప్పారు. దానికి ఆయన నిరాకరించగా వ్రాతపూర్వకమైన ఆదేశాల్ని జారీ చేశారు. అయినా ఆశ్రమం వరకూ వెళ్లాడే తప్ప వేదికపై కూర్చోవటంగాని, కార్యక్రమాల్లో పాల్గొనటం లాంటి పనులు చేయకుండా ప్రేక్షకుల మధ్య కూర్చున్నాడు.

కిందస్థాయి న్యాయమూర్తుల విషయంలోనే కాదు కోర్టులకొచ్చే ప్రజల పట్ల కూడా న్యాయస్థానాల్లో ఈ వివక్ష సాగుతూనే వుంది. ముద్దాయిల్నిగాని, సాక్షుల్ని గాని పిలవాల్సి వస్తే సుబ్బారావు, రామారావ్ అని ఏకవచనంతో సంబోధిస్తూ అధికారుల్ని, పోలీసుల్ని పిల్చేటప్పుడు "బంజారాహిల్స్ పోలీసువారు", "గుంటూరు తహశీల్దారు గారు", "లేబర్ కమిషనర్ గారు" అంటూ బహు వచనంతో పిలుస్తారు. న్యాయార్థులై కోర్టులకు వచ్చి లక్షలకు లక్షలు కోర్టు ఫీజు చెల్లిస్తున్న ప్రజల పట్ల ఈ అవమానకరమైన వివక్ష తగదు. జస్టిస్ ఎన్.వి.రమణ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయిన సందర్భంలో విద్యార్థి ఉద్యమంలో చిన్ననాడు మాకున్న అనుబంధంతో ఈ విషయం లేఖ రాసి రిజిస్టర్ పోస్టులో పంపించాను. కాని ఏ స్పందనా లేదు. అభ్యుదయ కాముకులైనవారిగా వామపక్ష పక్షపాతులుగా, వామపక్ష ఉద్యమాలలో పనిచేసినవారిగా తమని తాము అభి వర్ణించుకొనే అనేకమంది ఉన్నత న్యాయమూర్తులుగా పనిచేసినా జస్టిస్ చంద్రు తప్ప ఎవరూ ఈ సంస్కృతిని రూపుమాపే పని చేయలేదు.

రాజ్యాంగ సవరణ చేసి "సబార్డినేట్ కోర్టులు" అనే పదబంధాన్ని తొలగించి "జిల్లా న్యాయవ్యవస్థ" అని మార్చాలని జస్టిస్ డి.వై.చంద్రచూడ్ అన్నారు. చూద్దాం ఆయన ప్రధాన న్యాయమూర్తిగా వుండేకాలం సమీపిస్తోంది. ప్రజా స్వామికమైన ఈ కోర్కె నెరవేరుతుందని ఆశిద్దాం. నిజానికి ఈ విషయాల్లోనే కాదు సుప్రీం ప్రధాన న్యాయమూర్తులుగా పనిచేసిన జస్టిస్ సదాశివ గవర్నర్ పదవిని, జస్టిస్ గొగోయ్ రాజ్యసభ సభ్యత్వాన్ని అంగీకరించిన రోజే న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠ మసకబారింది.

ఈ-మెయిల్

దేశంలో జులై ఫస్ట్ నుండి 100 మైక్రాన్ లోపు మందం గల ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం అమల్లోకి రానుంది. అభినందనీయం. అయితే అది పూర్తిగా విజయవంతం కావడానికి చాలా పెద్ద ప్రయ త్నమే అవసరం. ప్రస్తుతం దేశంలో ప్లాస్టిక్ వినియోగం రోజువారీగా 25 వేల టన్నులు. అందులో దాదాపు సగభాగం సేకరణకు దూరంగా ఉండి పేరుకుపోతుంది. కొండల్లా పెరిగిపోతున్న ప్లాస్టిక్ వల్ల పర్యా వరణం తీవ్రంగా దెబ్బతింటోంది. తద్వారా ఆర్థికంగా కూడా దేశం నష్టపోవాల్సి వస్తుంది. కాబట్టి ప్లాస్టిక్ నియంత్రించడం అన్నది ఆదర్శం మాట అటుంచి అత్యవసరం. అయితే అది ప్రభుత్వం నియంత్రిస్తేనే చాలదు. ప్రజల్లో అవగాహన కల్పించాలి. ప్లాస్టిక్ కవర్ల స్థానంలో చేతి సంచీలు

ప్లాస్టిక్ భూతంపై గట్టి పోరాటం అవసరం

వినియోగించేలా, ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసు కోవాలి. చిన్నచిన్న వ్యాపారులకు ప్లాస్టిక్ కవర్లు చవకగా ఉండి సౌలభ్యంగా ఉంటున్నాయి. వారికి చూపే ప్రత్యామ్నాయాలు కూడా అదనపు భారం కాకుండా ఉండేలా చూడాలి. దశల వారీగా అమలౌతున్న ప్లాస్టిక్ నిషేధం తగిన తక్షణ ప్రత్యామ్నాయం అందుబాటులో ఉన్నప్పుడే విజయవంతం అవుతుంది. నిషేధాలు, జరిమానా విధింపులు అసలు యుద్ధంలో కేవలం ప్లాస్టిక్ కత్తులు కారాదు.

– డా. డి.వి.జి.శంకర రావు, మాజీ ఎంపీ, 9440836931.

ఆరోగ్యమైనా, అనారోగ్యమైనా... ఆహారంతోనే

డా. వల్లూరి రామారావు

మనం తినే ఆహారమే మన భవిష్యత్తు ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుందని చాలామందికి తెలియదు. అనారోగ్యం నుంచి బయట పడటానికి ఆహారం ఉపయోగపడుతుంది. ఆహారం రెండు ప్రక్కల పదునైన కత్తిలాంటిది. అనారోగ్యానికి, ఆరోగ్యానికి కూడా దారితీసే అవకాశముంది. ఏ ఆహారమైనా మితంగానే తినమంటారు ఆహార నిపుణులు. చాలా అనారోగ్యాలు మనం తినే ఆహారంతో, జీవన పద్ధతులతో ముడిపడి ఉండేవే. గతి తప్పిన జీవన విధానాల కారణంగా ఇప్పుడు జీవన శైలి వ్యాధులు ఎక్కువైపోయాయి. జీవన శైలి వ్యాధులలో మధుమేహం, ఊబకాయం, రక్తపోటు, గుండెజబ్బులు, క్యాన్సర్లు ఉన్నాయి. మధుమేహం జీవన శైలి వ్యాధులకు కెప్టెన్‌లా ఉండి, ప్రాణంతకమైన వ్యాధిగా చిన్న రక్తనాళాలను తాకి కన్ను, కాలు, కీడ్నీలు, గుండెజబ్బులకు కారణమవుతోందని రుజువైంది. మధుమేహం మనిషి జీవితాన్ని అతలాకుతలం చేస్తోంది. శతాబ్ద కాలంగా ఇన్సులిన్ ఆవిష్కరణలో అలసిపోయిన శాస్త్రజ్ఞులు 1942లో దీనిని కనుగొన్నారు. అయినా డయా బెటీస్ వికృతరూపం చూపిస్తూనే వుంది. టైపు2 మధుమేహానికి ప్రధాన కారణం ఊబకాయం, శారీరక శ్రమ లోపించడం, అపరిమితపు ఆహారం, మానసిక ఒత్తిడి, పట్టణీకరణ, జన్యుపరమైన అంశాలు. వీటిలో వాయు కాలుష్యం వల్ల పట్టణ వాసులకు ప్రమాదం మూడింతలైంది. ప్రస్తుతం 537 మిలియన్ల మంది మధుమేహంతో బాధపడుతున్నారు. 2045 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 700 మిలియన్ల మంది షుగర్ వ్యాధిగ్రస్తులవుతారని ఓ అంచనా.

మధుమేహ నియంత్రణకు సూచనలు

ఆహారం, శారీరక వ్యాయామం, సరైన మందులు, సరిపడినంత నిద్ర, ఒత్తిడి తగ్గించుకొనే ప్రయత్నం మొదలైన విషయాలలో అవగాహన కల్పించే నిపుణులైన వైద్యులను సంప్రదించాలని ప్యూర్ డైట్: లాన్సెట్ అనే జర్నల్ 2017 ప్రచురించిన ప్యూర్ స్టడీ-ప్రాస్పెక్టివ్ అర్బన్ రోస్టర్ - ప్రపంచ

వ్యాప్తంగా ఆహారపు అలవాట్లుపై జరిపిన అధ్యయనం తేల్చిన విషయం. ప్రాస్పెక్టివ్ అర్బన్ రూరల్ ఏపిడిమియాలజీపై 2003 నుంచి 2013 వరకు 35-70 సంవత్సరాల మధ్య వయసు వారిపై చేపట్టిన అధ్యయనం తేల్చిన విషయం అధిక పిండిపదార్థాలు తీసుకోవడం వల్ల మరణాలూ సంభవి స్తాయని పేర్కొంది. సంతృప్త కొవ్వులవల్ల పక్షవాతం వస్తుంది. ఈ ఫలితాల వెలుగులో ప్రపంచ ఆహార మార్గదర్శకాలు పునఃపరిశీలించాని తేల్చారు.

గత 60-70 సంత్సరాలుగా గుండె సంబంధిత వ్యాధులకు అసలు కారణం అధిక మొత్తంలో కొవ్వు పదార్థాలు తీసుకోవటమని తేల్చారు. రెండవ ప్రపంచయుద్ధానంతరం సామ్రాజ్యవాద దేశాల శాస్త్రజ్ఞులు చేసిన తప్పుడు ప్రచారం వల్ల ప్రజలు ఎక్కువ పిండిపదార్థాలు-పారిశ్రామిక ఉత్పత్తులైన రిఫైన్డ్ అలవాట్లకు మరలించింది. గుండె జబ్బులకు సంతృప్త కొవ్వే కారణ మని నిరూపించేందుకు ఏడు దేశాలు ప్రయత్నించాయి. చెడు కొలస్ట్రాల్ భూతాన్ని చూపిస్తూ చేసిన ప్రయత్నం ఇది. తక్కువ కొలస్ట్రాల్- లేదా మంచి కొలస్ట్రాల్ గల గుండెకు మరొక బాధ తైలం అంటూ సన్‌ఫ్లవర్ రిఫైన్డ్ ఆయిల్ మార్కెట్ నింపింది. బహుళ జాతి కంపెనీలు రిఫైన్డ్ ఆయిల్ అమ్మకాలు పెంచింది. ముఖ్యంగా చెడు కొలస్ట్రాల్ అనేది శుద్ధి చేసిన చక్కెర, పిండిపదార్థాలు ఎక్కువగా వాడటం వలన వస్తుంది. కాని జంతుమాంసపు కొవ్వునుంచి కాదు. అలాగే రిఫైన్డ్ వెజిటబుల్ ఆయిల్స్ కూడా హానికరమే. అందువలన తక్కువ పిండిపదార్థాలు ఎక్కువ కొవ్వు పదార్థాలు గల ఆహారం మంచిది. ఇలాంటి ఆహార నియమావళి చిత్తశుద్ధిగల వైద్యులు న్యూట్రిష నిస్టులు తమ అనుభవాల పరిశీలనతో రోగులను చైతన్య పరిచి ఆరోగ్య కరమైన జీవనానికి తోడ్పడాలి. పూర్వం 60 సంవత్సరాల క్రితం నానమ్మలు, అమ్మమ్మలు పిల్లలకి పులవబెట్టిన అన్నం ఉదయం తినే అలవాటు చెయ్యటం ఎంతమేలు చేసేదో. అన్ని పోషకాలతో మంచి బ్యాక్టీరియాతో తయారైన ఆహారం ఆకలిని పెంచి ఆరోగ్యవంతులైన పిల్లలకు సహాయపడింది. చాక్లెట్లు, శీతల పానీయాలతో పాటు మార్కెట్టులో దొరికే జంక్‌ఫుడ్‌లు ఆరోగ్యకరమైన ఆహారం కాదు. మనం తీసుకొనే పండ్లలో సుక్రోజ్, ఫ్రక్టోజ్ షుగర్లు ఉండాలి. ఫ్రక్టోజ్ కాలేయం మాత్రమే గ్రహించగలదు. ఫ్రక్టోజ్ నుచి తయారయ్యే హైఫ్రక్టోజ్ కార్న్ సిరప్ తీపి పదార్థాలు, బేకరి తయారీ పదార్థాలలో రుచికోసం కలపడం పరోక్షంగా హాని జరుగుతుంది. జాన్ యూడికిన్ అనే బ్రిటీష్ ఫిజీషియన్ పిండిపదార్థాలే గుండె జబ్బులకు కారణమని అధిక కొవ్వు కాదని సూచించారు. ప్యూర్ డైటు అధ్యయనంలో దక్షిణ భారతదేశంలో వున్న మెడిటేరియన్ డైట్ వుందని, 50 శాతం పచ్చటి ఆకు కూరగాయలు చేరటం ఆమోదించతగినదనే అభిప్రాయం వెలిబుచ్చారు. ఇతర పోషకాలు పాలిష్ చేయని రాగులు, సజ్జలు, జొన్నలు, బ్రౌన్ రైసు తీసుకోవటం పిండి పదార్థాల నిష్పత్తి తగ్గించేవిగా ఉపయోగపడతాయి.

వంట నూనెలు : సంతృప్త కొవ్వువున్న వెన్న, నెయ్యి, కొబ్బరినూనె ఉత్తమమైనవి. సౌత్ ఈస్ట్ ఏసియాలో శ్రీలంక, ఇండియా, బంగ్లాదేశ్‌లో వెన్న నుండి తయారు చేసిన నెయ్యి చిన్న పిల్లల పెరుగుదలకు దోహదపడుతుందని, మెదడు పని తీరును పెంచుతుందని గుర్తించారు. రాష్ట్రాలవారీగా కేరళలో కొబ్బరినూనె ప్రాచుర్యం పొందింది. తమిళనాడులో పామ్‌ఆయిల్, కొన్నిచోట్ల మస్టర్డు ఆయిల్, వేరుశనగ నూనె ఏ నూనైనా హానికరం కాదు- రిఫైన్డ్ చేయనంత వరకు. సాధారణంగా ఏ పండైనా షుగరు స్థాయి పెంచేదే.

(నేడు డాక్టర్స్ డే)

వ్యాస రచయిత ఎంబిబిఎస్, డి.ఎన్.బి
అక్షధ క్లినిక్, విజయవాడ

జీఎస్టీకి ఐదేళ్లు - రాష్ట్రాలకు తప్పని నష్టాలు

న్యూఢిల్లీ : వస్తువులు, సేవల పన్ను (జీఎస్టీ) అమల్లోకి వచ్చి జూన్ 30 నాటికి ఐదేళ్లు పూర్తి అయ్యాయి. అంటే అర్ధ దశాబ్దం గడిచింది. ఈ ప్రయాణం అనేక ఒడిదుడుకుల మధ్య సాగింది. కొత్త పన్ను విధానం అమలుతో సామాన్యులపై భారం పెరగడమే కాకుండా రాష్ట్రాల ఆదాయానికి గండి పడింది. ఇదే అంశంపై చర్చోపచర్చలు జరుగుతూనే ఉన్నాయి. సరళమైన జీఎస్టీ విధానాన్ని తీసుకు రావడం సబబుగా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. నష్టాలు లేకుండా సరఫరా చెయిన్‌ల ద్వారా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌కు అడ్డులేని విధానం కావాలంటున్నారు. బీడీఓ ఇండియా పార్ట్‌నర్ & లీడర్-పరోక్ష పన్నుకు చెందిన గుంజన్ ప్రభాకరన్ స్పందించారు. 'ఐదేళ్లలో జీఎస్టీ చట్టం వల్ల అనేక సమస్యలు వచ్చాయి. సవరణలు జరిగినా మదుపరులు ఇబ్బంది పడ్డారు. వారెంటు లేకుండా షోకాజ్‌ల జారీతో పన్ను చెల్లింపుదారుల సమస్యలు పెరిగాయి. వీటి తక్షణ పరిష్కారానికి జీఎస్టీ మండలి, ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. సులభతర వాణిజ్యంతో పాటు పన్నులపై ప్రభావాన్ని తగ్గించేలా పటిష్ఠమైన, సాంకేతిక పరిజ్ఞానాధారిత మూల్యాకనం పద్ధతిని అమలుచేయాలి' అని గుంజన్ అన్నారు. ఐదేళ్లలో జీఎస్టీ చట్టం వేగంగా పరిపక్వత చెందిందని ఏఎంఆర్‌జీ & అసోసియేట్స్ సీనియర్ భాగస్వామి రజత్ మోహన్ అన్నారు. తొలుత సమ్మతి (కంప్లైన్స్), టెక్నాలజీపై దృష్టి పెట్టగా తర్వాత పన్ను చెల్లింపుదారులపైకి దానిని మళ్లించింది. ఇప్పుడు కొత్త దశలోకి ప్రవేశించింది. అస్పష్టమైన పన్ను చట్టాల స్థానంలో కొత్తవి తేవడం లేదా సాంకేతిక సమస్యలను పరిష్కరించడం ద్వారా వ్యాజ్యాలను తగ్గించుకోవాలి అని అన్నారు. బీపీఓ/కేజీఓ తరహా మధ్యవర్తిత్వం, మూలధన వ్యయానికి పన్ను రుణం, ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ (ఈఎన్‌ఏ)పై జీఎస్టీ లెవీ వంటివి ప్రభుత్వమే పరిష్కరించాలని వ్యాపారవేత్తలు భావిస్తారని మోహన్ తెలిపారు. జీఎస్టీ యంత్రాంగం దూకుడుగా సాగుతున్నప్పటికీ జీఎస్టీ పూర్తి సామర్థ్యాన్ని సాధించడం ఇప్పుడప్పుడే జరిగే పనికాదు. దానిని నిజమైన 'సు- సరళ పన్ను'గా మార్చాలి. పెట్రోల్, డీజిల్ ఏటీఎఫ్ వంటివి జీఎస్టీ పరిధిలో లేవు. పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తేవడం ద్వారా కంపెనీలకు వ్యయం తగ్గుతుంది అని ట్యాక్స్ నిపుణులు అంటున్నారు. సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న క్రమంలో వర్చువల్ డిజిటల్ అసెట్స్ (వీడీఏ) లేదా క్రిప్టో కరెన్సీ వంటివి ఆవిర్భవిస్తున్నాయి. ఇవి వస్తువులు లేక సేవల కిందకు వస్తాయో లేదో స్పష్టం చేయాలి. వీటిపై పన్నురేటు ఎంతో వెల్లడించాలి. పన్ను రేటు హేతుబద్ధీకరణ ఎప్పుడోప్పుడు జరగాల్సిందే. ప్రస్తుతం ద్రవ్యోల్బణంపై ఆందోళనలతో జీఎస్టీ రేట్లు, శ్లాబుల సర్దుబాటు ప్రణాళికలు గాడితప్పాయి. కేంద్రం, రాష్ట్రాలకు ఆదాయం కావాలి కాబట్టి ఇది ఏదో రోజు వాస్తవ రూపం దాల్చుతుంది. తక్కువ శ్లాబులు అంటే సరళీకృత పన్ను విధానం అని అర్థం. మండలిలోని నిర్ణేతలు రాష్ట్ర ప్రభుత్వాల సమస్యలకు పరిష్కారాన్ని చూపాలి. జీఎస్టీ

నెలకు రూ.1.3లక్షకోట్ల వరకు పన్ను వసూళ్లు

వల్ల రాష్ట్రాలకు వచ్చే ఆర్థిక నష్టాల భర్తీకి మార్గాన్ని సూచించాలి. రాష్ట్రాలకు సంబంధించి ఏఏఆర్ తీర్పుల్లో భిన్న అభిప్రాయాల పరిష్కారానికి కేంద్ర యంత్రాంగాన్ని ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలి అని కేపీఎంజీకు చెందిన అభిషేక్ జైన్ అన్నారు. పెట్రోలియం, విద్యుత్‌ను జీఎస్టీ పరిధిలోకి తేవడం ద్వారా సారూప్యతకు ఆస్కారం ఉంటుందని అభిప్రాయపడ్డారు. పన్ను చెల్లింపుదారులకు అనవసర వేధింపులను కట్టడి చేసేందుకు సిస్టమ్ ద్వారా వెలువడే జీఎస్టీ నోటీసులను పరిశీలించాలని జైన్ సూచించారు. ఇదిలావుంటే, కొత్త పన్ను విధానం సజావుగా అమలయ్యేందుకు అవసరమైన అంశాలపై చర్చించేందుకు కేంద్రంతో పాటు రాష్ట్రాలు సమావేశమవుతాయి. జీఎస్టీ మండలి ఇప్పటివరకు 47సార్లు భేటీ అయింది. ఈక్రమంలో నెలకు రూ.లక్ష కోట్ల జీఎస్టీ వసూళ్లు మామూలైపోయింది. దీనిని రూ.1.4లక్షకోట్లకు పెంచేందుకు కసరత్తు జరుగుతోంది. 2022 ఏప్రిల్‌లో రూ.1.68లక్ష కోట్ల పన్ను వసూళ్లు జరిగాయి. 2018 ఏప్రిల్ తర్వాత రూ.లక్షకోట్ల మార్కును దాటింది.

శాంతి కోసం ప్రజలకు పిలుపివ్వండి

మోదీకి కాంగ్రెస్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: దేశంలో నెలకొన్న పరిస్థితిపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆందోళన వెలిబుచ్చింది. శాంతి, సామరస్యతను పాటించాల్సిందిగా ప్రజలకు పిలుపునివ్వాలని ప్రధాని నరేంద్రమోదీకి విజ్ఞప్తి చేసింది. ఉదయ్‌పూర్ దుర్ఘటనలో విదేశీ శక్తుల హస్తం ఉందన్న వార్తలపై ముఖ్యమంత్రులతో సమాచారాన్ని ఎందుకు పంచుకోవడం లేదని మోదీని కాంగ్రెస్ నేత అల్కా లాంబా గురువారం ప్రశ్నించారు. 'దేశంలో నెలకొన్న ప్రస్తుత వాతావరణంపై కాంగ్రెస్ ఆందోళన చెందుతోంది. దీనిపై ప్రధాని చొరవ తీసుకోవాలి. శాంతి, సామరస్యతల కోసం మోదీ ప్రజలకు విజ్ఞప్తి చేయాలి' అని లాంబా విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. శాంతి, సోదరతత్వం లేకపోతే ఏ దేశం ప్రగతి సాధించలేదని, ఇదే పరిస్థితి కొనసాగితే దేశాభివృద్ధికి విఘాతం కలుగుతుందని ఆమె అన్నారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఓ పక్క విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల గురించి మాట్లాడుతున్నారని, అవి రావాలంటే శాంతియుత వాతావరణం సృష్టించాల్సిన అవసరం ఉందని హితవు పలికారు. 'మీ దృష్టిలో ఎఫ్‌డీఐ అంటే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు. కానీ పెట్టుబడులతో దేశంలోకి రావాలనుకునే వారికి ఎఫ్‌డీఐ అంటే భయం, వంచన, బెదిరింపులు గుర్తుకొస్తున్నాయి' అని లాంబా విమర్శించారు. భయోత్పాతం కారణంగా 8 వేలమంది వ్యాపారవేత్తలు పారిపోవాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. పార్లమెంటును సమావేశపరిచి...ప్రస్తుత పరిణామాలపై చర్చించాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. దేశంలో శాంతి కొనసాగించాలని 13 ప్రధాన పార్టీలు విజ్ఞప్తి చేశాయని గుర్తుచేశారు. ప్రధాని, కేంద్ర హోంమంత్రి ముందుకొచ్చి శాంతి వాతావరణం నెలకొనేలా చొరవ తీసుకోవాలని సూచించారు. అగ్నిపథ్ పథకంపై యువత రోడ్లపైకి వచ్చిందని, దీనిని పరిష్కరించే బాధ్యత మోదీపైనే ఉందని చెప్పారు. కానీ మోదీ మాత్రం మౌనంగా ఉండటాన్నే ఎంచుకున్నారని విమర్శించారు.

జమ్మూలో రోడ్డెక్కిన వేలాది కూలీలు

రెగ్యులరైజ్ చేయాలని వారం నుంచి నిరసనలు

జమ్మూ: జల్‌శక్తి శాఖలో పనిచేస్తున్న వేలాది రోజువారీ కూలీలు తమను రెగ్యులర్ చేయాలనీ, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ గత వారం రోజులుగా ధర్నాలు, వివిధ రూపాలలో ఆందోళన చేస్తున్నారు. అయినా లెఫ్ట్‌నెంట్ గవర్నర్ (ఎల్జీ), కేంద్రం పట్టించుకోకపోవడంతో వేలాది మంది రోజువారీ కూలీలు గురువారం రోడ్డెక్కారు. రోడ్డు, వంతెనలను బ్లాక్ చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సెక్రటేరియట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ ప్రభుత్వం తప్పుడు హామీలతో కాలయాపన చేస్తున్నదని, ప్రభుత్వం పట్టించుకోకపోతే తమ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని కూలీల నాయకుడు రవి హాన్స్ తెలిపారు. కాగా, అక్కడి జల్‌శక్తి శాఖలో దాదాపు 60 వేల మంది రోజూవారీ కూలీలు పనిచేస్తున్నారు. వారి డిమా ండ్లు నెరవేర్చటంలో బీజేపీ, లెఫ్టినెంట్ గవర్నర్ విఫలం కావటంతో కూలీలు ఆందోళనబాటపట్టారు.

ప్రతి గ్రామానికి హైస్పీడ్ ఇంటర్నెట్

బాష్ క్యాంపస్ ప్రారంభోత్సవంలో మోదీ

బెంగళూరు : దేశంలోని ప్రతి గ్రామానికి అత్యుత్తమైన హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలను అందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. సాంకేతిక రంగంలో కీలకపాత్ర వహిస్తోన్న బాష్ ఇండియా బెంగళూరులో నిర్మించిన నూతన క్యాంపస్‌ను ఆయన వీడియా కాన్ఫరెన్సు ద్వారా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ దేశంలో బాష్ ఇండియా వంద సంవత్సరాలుగా సేవలు అందిస్తోందని, తాను 2015లో నాటి జర్మన్ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్‌తో కలిసి బాష్ కార్యాలయాన్ని సందర్శించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. బాష్ సంస్థ వందేళ్ల కిందట జర్మనీ సంస్థగా దేశంలోకి అడుగుపెట్టి పూర్తిగా భారతదేశానికి చెందిన సంస్థగా గుర్తింపును సంపాదించుకుందని పేర్కొన్నారు. రానున్న పాతికేళ్లలో బాష్ సంస్థ చేరుకోవాల్సిన లక్ష్యాలను నిర్దేశించుకుని పని చేయాలని అభిలషించారు. నేడు భారత్ సాంకేతిక విజ్ఞాన రంగంలో ప్రపంచ దేశాలతో పోటీ పడుతోందని పేర్కొన్నారు. ఈ రంగంలో పెట్టుబడులకు భారత్ మంచి వేదికగా ఉందని చెప్పారు. ప్రపంచ దేశాల పెట్టుబడులను ఆకర్షించేందుకు చర్యలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. ప్రపంచదేశాల పెట్టుబడిదారులు భారత్‌లో పెట్టుబడుతు పెట్టాలంటూ పిలుపునిచ్చారు. టెక్నాలజీ రంగంలో భారతీయ యువత శక్తి సామర్థ్యాలు ప్రపంచ దేశాలకన్నా ఎక్కువని అభినందించారు. డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా రానున్న రోజుల్లో దేశంలోని ప్రతి గ్రామానికి హైస్పీడ్ ఇంటర్నెట్ అందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకుని టెక్నాలజీ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా మరింత విస్తరించాలని సూచించారు.

అసోంలో తగ్గని వరద

గౌహతి : అసోంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల ధాటికి తలెత్తిన వరదలు రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాయి. బుధవారం నాటికి వరదలు తగ్గకపోవడంతో పరిస్థితి మరింత దిగజారినట్టు అధికారులు తెలిపారు. తాజాగా మరో 12 మంది మృతి చెందడంతో ఇప్పటివరకూ మృతి చెందిన వారి సంఖ్య 151 కి చేరుకుందని పేర్కొన్నారు. గత 11 రోజులుగా రాష్ట్రంలోని 26 జిల్లాల పరిధిలో 31 లక్షల మందికిపైగా ప్రజలకు వరద ప్రభావానికి గురైనట్టు పేర్కొన్నారు. సిల్చార్ పట్టణంలోని అనేక ప్రాంతాలు ఇప్పటికీ నీటిలోనే ఉన్నాయని తెలిపారు. ఆహారం, నిత్యావసరాలు, మందులు కూడా సరఫరా చేయలేని స్థితి ఉందని చెప్పారు. బెకి, కోపిలి, బరాక్, కుషియారా పరిసర ప్రాంతాల్లో బ్రహ్మపుత్ర నది ప్రమాదకర స్థాయిని మించి ప్రవహిస్తోందని పేర్కొన్నారు.

ఆ ఉద్దేశం లేదని తేల్చండి

సెతల్వాడ్ అరెస్టుపై సీజేఐకు 300 మంది ప్రముఖుల లేఖ

న్యూఢిల్లీ : మానవహక్కుల కార్యకర్త తీస్తా సెతల్వాడ్ అరెస్టు తమ ఉద్దేశం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేయాలని 300 మందికి పైగా ప్రముఖులు భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) ఎన్వీ రమణకు లేఖ రాశారు. తీస్తా సెతల్వాడ్, ఆర్‌బీ శ్రీకుమార్‌ల అరెస్టు ద్వారా న్యాయస్థానాల్లో న్యాయసాధనకు, న్యాయవాదులకు ఓ హెచ్చరిక జారీ అయిందని వారు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ప్రతీకార చర్యలను సుప్రీంకోర్టు ముందుగానే ఆమోదించాలనుకోవడం నమ్మలేకపోతున్నామన్నారు. గతంలో ఎమర్జెన్సీ సమయంలోనూ సుప్రీంకోర్టు ఇలా చేయలేదని, చట్టపరమైన ప్రక్రియలను కోరుతూ తమ వద్దకు వచ్చిన వారి నిర్బంధకాండకు దారితీయలేదు అని పేర్కొన్నారు. ఏడీఎం జబల్‌పూర్‌లో పౌరుని పక్షాన కోర్టు నిలవలేకపోయి ఉండవచ్చుగానీ పౌరుల కోసం న్యాయస్థానంలో పోరాడేవారిని అణచివేసేలా వ్యవహరించలేదు అని పాట్నా హైకోర్టు మాజీ న్యాయమూర్తి అంజనా ప్రకాష్, న్యాయవాది కేఎస్ చౌహాన్, అలహాబాద్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి అమర్ శరణ్, అవనీ బన్సాల్, ఆనంద్ గ్రోవర్, ఇందిరా జైసింగ్, పరంజయ్ గుహా , రామచంద్ర గుహా, సంజయ్ హెగ్డే, నవ్రోజ్ సర్వాయి, అంజనా మిశ్రా, మనోజ్ ఉన్నారు. కుమార్ ఝూ, కవితా కృష్ణన్ తదితరులు రాసిన లేఖ పేర్కొంది. కోర్టు తీర్పులో అస్పష్టత వల్ల తీస్తా సెతల్వాడ్ తదితర కార్యకర్తలు అరెస్టు అయ్యారని, ఇదే కొనసాగితే వారికి కనీసం బెయిల్ ఇచ్చే పరిస్థితి ఉండదని ప్రముఖులు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ వ్యవహారంలో తగు చర్యలు చేపట్టాలని భారత ప్రధాన న్యాయమూర్తికి విన్నవించారు. అల్లర్ల కేసుల దర్యాప్తు కోసం ఏర్పాటైన సిట్‌ను తప్పుదారి పట్టించడం ద్వారా అమాయకులను జైలుకు పంపే కుట్ర జరిగిందని వారు ఆరోపించారు. కాగా, 2002 గుజరాత్ అలర్లలో పాత్ర ఉందన్న ఆరోపణలతో నరేంద్ర మోదీ తదితరులపై కేసు నమోదు చేయడానికి దిగువ కోర్టు నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ జకియా జాఫ్రీ, తీస్తా సెతల్వాడ్ సుప్రీంకోర్టుకు అప్పీలు చేశారు. వారి పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఆ మరుసటి రోజు సెతల్వాడ్‌తో పాటు గుజరాత్ మాజీ పోలీసు అధికారి శ్రీకుమార్‌ను గుజరాత్ ఏటీఎస్ అరెస్టు చేసిన విషయం విదితమే.

ప్రత్యర్థి పార్టీల కుట్రలపై అప్రమత్తత

పార్టీ శ్రేణులకు మాయావతి హితబోధ

లక్నో: తమకు గల ప్రజా మద్దతును ఎన్నికల సమయంలో ఓట్ల రూపంలోకి మార్చడానికి కష్టపడి పనిచేయాలని బీఎస్‌పీ అధినేత్రి మాయావతి తమ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రత్యర్థి రాజకీయ పార్టీల కుట్రలు, కుతంత్రాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సున్నితంగా హెచ్చరించారు. ఇటీవల జరిగిన రెండు లోక్‌సభ ఉపఎన్నికల తర్వాత బీఎస్‌పీ కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలతో మాయావతి గురువారం సమావేశమయ్యారు. ఎన్‌డీఏ రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపదీ ముర్ముకు పార్టీ మద్దతుపై నాయకులకు వివరణ ఇచ్చారు. ముర్ము గిరిజన తెగకు చెందిన మహిళ. అంతేకాకుండా గిరిజనులు బహుజన సమాజంలో అంతర్భాగమని బీఎస్‌పీ అధినేత్రి చెప్పారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత పటిష్టవంతం చేయాలని మాయావతి పార్టీ కార్యకర్తలకు విజ్ఞప్తి చేసినట్లు బీఎస్‌పీ ఓ ప్రకటనలో తెలిపింది. పార్టీ పునాదులను మరింత విస్తరింపచేయడానికి, ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేయాలని పిలుపిచ్చింది. దీనికి సంబంధించి కొన్ని మార్గదర్శకాలను వెల్లడించింది. బీఎస్‌పీ పటిష్ఠమైన సైద్ధాంతిక, రాజకీయ మూలాలు గల పార్టీ అయినప్పటికీ ప్రత్యర్థి పార్టీలు అనుసరిస్తున్న కుల, ఇతర స్వార్థపూరిత చర్యల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపింది. భారీ ప్రజామద్దతు గల పార్టీకి సరైన సమయంలో అవి ఓట్ల రూపంలోకి మారడం లేదని అభిప్రాయపడింది. దీనిని దృష్టిలో పెట్టుకొని పార్టీ మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తూ...ముందుకు సాగాలని మాయావతి చెప్పినట్లు ప్రకటన తెలిపింది. కులతత్వ ప్రత్యర్థి పార్టీలు బీఎస్‌పీ, దాని మానవతా ఉద్యమానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నాయి. ప్రత్యేకించి ఎన్నికల సమయంలో విజయం కోసం ఆ పార్టీలన్నీ ఐక్యంగా మనకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని మాయావతి విమర్శించారు. ప్రత్యేకించి ముస్లిం మైనారిటీలను మనకు వ్యతిరేకంగా మారుస్తున్నారని పేర్కొన్నారు. ద్రౌపది ముర్ముకు మద్దతు ఇవ్వడానికి గల కారణాలను మాయావతి నాయకులకు వివరించారు. ముర్ము గిరిజన ఆదివాసీ మహిళ. గిరిజన సామాజిక వర్గంలో అత్యంత వెనుకబడిన వర్గం. అది బహుజన సమాజ్‌లో అంతర్భాగమే. అందుకే పార్టీ లేదా వ్యక్తిగతం అనే అంశాలను పరిగణనలోకి తీసుకోలేదని ఆమె తెలిపారు. దీనిపై బీఎస్‌పీ స్వతంత్రంగానే నిర్ణయం తీసుకున్నదని, ఇది పాలక ఎన్‌డీఏ లేదా ప్రతిపక్ష యూపీఏకు వ్యతిరేకం కాదని స్పష్టంచేశారు. బీఎస్‌పీని యూపీఏ ఏనాడు విశ్వాసంలోకి తీసుకోలేదని, ఉమ్మడి అభ్యర్థిపై తమను సంప్రదించలేదని తెలిపారు. అగ్నిపథ్ పథకం, దేశంలో నెలకొన్న అశాంతి, దారిద్ర్యం, ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటి అనేక తీవ్రమైన అంశాలపై మాయావతి మాట్లాడారు. ప్రజా సమస్యలపై మోదీ సర్కారు నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు.

ఆంత్రాక్స్ కలకలం...అడవిపందుల మృతి

ఆందోళన అవసరం లేదన్న కేరళ అధికారులు

త్రిస్సూర్/తిరువనంతపురం: కేరళలో ఆంత్రాక్స్ వ్యాధి కలకలం రేపుతోంది. రాష్ట్రం లోని అథిరాపల్లి అటవీ ప్రాంతంలో ఇటీవల అడవి పందులు వరుసగా మృత్యువాత పడటాన్ని గమనించిన అధికారులు... వాటి నమూనాలను పరీక్షలకు పంపారు. అడవి పందులు ఆంత్రాక్స్ తోనే చనిపోయినట్లు నిర్ధారణ అయింది. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. అథిరాపల్లి అటవీ ప్రాంతంలోని కొన్ని అడవి పందుల్లో ఆంత్రాక్స్ ఉన్నట్లు తేలిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ వెల్లడించారు. అయితే ఆంత్రాక్స్ వ్యాధి మరింత వ్యాప్తి చెందకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. అడవి పందులతో పాటు ఇతర జంతువులు మూకుమ్మడిగా మృత్యువాత పడితే, అధికారులకు సమాచారం అందించాలని, ప్రజలెవరూ అలాంటి ప్రదేశాలకు వెళ్లవద్దని సూచించారు. ఆంత్రాక్స్ వ్యాధి పట్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదని ఆరోగ్య అధికారులు చెబుతున్నారు. త్రిస్సూర్ జిల్లా కలెక్టర్ హరిత వి కుమార్ మీడియాతో మాట్లాడుతూ... ఈ ఏరియాలో పశువులు సహా పెంపుడు జంతువుల్లో వ్యాధిలక్షణాలు లేవని తెలిపారు. జంతువల నుంచి ఈ వ్యాధి మనుషులకు వ్యాపించే అవకాశాలు చాలా తక్కువని ఆమె పేర్కొన్నారు. ఎవరూ భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పశువులకు టీకాలు వేసే సమయంలో ఆంత్రాక్స్ నివారణ చర్యలపై అవగాహన కల్పించేదుకు సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆంత్రాక్స్ వ్యాధి వ్యాప్తి ఇలా...

పశువులు, గొర్రెలు, మేకలకు సోకే దొమ్మరోగం లేక నెత్తురెంక లేక రక్తపు దొమ్మ వ్యాధిని ఆంగ్లంలో ఆంత్రాక్స్‌గా పిలుస్తారు. జీవాలు తాగేనీరు, తినే గ్రాసం, ఇతర కీటకాల ద్వారా వాటి రక్తంలోకి ఈ వైరస్ ప్రవేశించి వేగంగా పెరిగి 2, 3 రోజుల్లోనే ప్రాణాన్ని బలిగొంటుంది. ఈ వ్యాధి సోకిన జీవాల కళేబరాలను ఊరికి దూరంగా 3 అడుగుల లోతు గొయ్యి తవ్వి సున్నం వేసి పూడ్చిపెట్టాలి. అవి చనిపోయిన ప్రాంతంలోని చెత్తనంతా తగలబెట్టేయాలి. కొన్నిసార్లు ఆయా జీవాలు ఆంత్రాక్స్‌తో చనిపోయిన విషయం తెలియక, వాటిని కోసి మాంసం ఇతరులకు అమ్మడం లేదా కాపరులే వండుకుని తినడం జరుగుతోంది. వాటిని కోసి తినకపోయినా, కళేబరాలను నిర్లక్ష్యంగా వదిలేయడమూ ప్రమాదకరమే. కొందరు వాటి చర్మాన్ని ఒలిచి తీసుకుంటున్నారు. ఆ చర్మం ముట్టుకున్నవారికి, ఆ మాంసం తిన్న కాకులు, కుక్కలు, ఇతర పురుగుల ద్వారా వైరస్ మనుషులకు సోకే ప్రమాదం ఉంది.

బాకీ తీర్చలేదని... వివస్త్రను చేసి!

బెంగళూరు: బీజేపీ పాలిత కర్ణాటకలోని బెంగళూరులో దారుణం చోటుచేసుకున్నది.చేసిన అప్పు తీర్చలేదన్న సాకుతో ఇద్దరు అక్కాచెల్లెళ్లపై దాడి చేసి వారిని వివస్త్రలను చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదు. ఈ ఘటనపై ప్రజలు తీవ్ర నిరసన తెలపడంతో రెండు రోజుల తర్వాత నిందితులపై పోలీసులు కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్ట్ చేశారు. మూడో వ్యక్తి ఇంకా పరారీలో ఉన్నాడు. పిల్లల చదువుల కోసమని బాధితుల్లో ఒకరు రామకృష్ణా రెడ్డి అనే వ్యక్తి దగ్గర లక్ష రూపాయలు అప్పుగా తీసుకున్నారు. అప్పు తీర్చాలని ఒత్తిడి చేయగా స్థలం అమ్మి కట్టాలని నిర్ణయించారు. గ్రామస్థులు కూడా రామకృష్ణకు సర్ది చెప్పారు. అయినప్పటికీ వినకుండా రామకృష్ణా రెడ్డి, మరో ఇద్దరు వ్యక్తులు బాధితుల ఇంట్లోకి చొచ్చుకెళ్లి అక్కాచెల్లెళ్లను వివస్త్రలుగా చేసి దాడిచేశారు.

బెడ్‌షీట్‌లో చుట్టి దవాఖానకు!

అహ్మదాబాద్: ఎంతో అభివృద్ధి చేశామని పాలకులు గొప్పలు చెప్పుకుంటున్న ప్పటికీ అనారోగ్యంతో ఉన్న వ్యక్తి ఆసుపత్రికి వెళ్లాలంటే అష్టకష్టాలు పడాల్సివస్తోంది. గుజరాత్‌ను ఎంతో అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్న బీజేపీ పాలకులకు ఈ ఘటనకు ఏమి సమాధానం చెపుతారో చూడాలి. దేవకీ బెన్ వయస్సు 75 ఏండ్లు. తీవ్ర జ్వరం వచ్చింది. దవాఖానకు వెళ్లాలి. కానీ, ఆమె ఉంటున్న ఊరికి రోడ్డు లేదు. వాహనం వచ్చే పరిస్థితి లేదు. ఊరికి అవల ఉన్న మెయిన్ రోడ్డు దాకా వెళ్లాలంటే 4-5 కిలోమీటర్లు నడిచి వెళ్లాలి. దేవకీ కుమారుడు ధీరజ్ ఆమెను ఓ బెడ్ షీట్‌లో పడుకోబెట్టాడు. బెడ్ షీట్ రెండు చివరలను ఓ పొడుగాటి కర్రకు కట్టాడు. స్థానికుల సాయంతో కర్రను భుజాలపై మోస్తూ మెయిన్ రోడ్డు దాకా వెళ్లాడు. అక్కడి నుంచి వాహనంలో దవాఖానకు తరలించాడు. ఇదంతా జరిగింది ప్రధాని మోదీ స్వరాష్ట్రం గుజరాత్‌లో. 182 మీటర్ల ఎత్తైన సర్దార్ పటేల్ విగ్రహం నిర్మించిన కేవడియాకు కేవలం ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న జార్వాని గ్రామం లో. తల్లిని బెడ్ షీట్‌లో మోసుకెళ్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

మణిపూర్ ప్రమాదం బాధాకరం : రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : మణిపూర్‌లోని నోని జిల్లాలో భారీ ఎత్తున కొండ చరియలు విరిగి పడటంతో ఏడుగురు మరణించడం చాలా బాధాకరమని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. ప్రమాదంలో మృతి చెందిన వారికి సంతాపం తెలిపారు. బంధువులను కోల్పోయిన కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ప్రమాదంలో గాయపడ్డ వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ గురువారం ట్వీట్ చేశారు. నోని జిల్లాలోని ముఖ్యం ప్రాంతాంలో ఉన్న తుపుల్ యార్డ్ రైల్వే కన్‌స్ట్రక్షన్ క్యాంపునకు సమీపంలోని కొండ చరియలు బుధవారం అర్ధరాత్రి విరిగిపడిన ఘటనలో ఏడుగురు మృతి చెందగా 13 మంది గాయపడ్డారు.

కరోనా ఉధృతి...లక్షదాటిన క్రియాశీల కేసులు

న్యూఢిల్లీ: దేశంలో మరోసారి కరోనా కేసులు ఆందోళనకర స్థాయిలో నమోదయ్యాయి. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు 24 గంటల్లో కొత్తగా 18,819 మంది వైరస్ బారినపడగా... కరోనా వైరస్ తో పోరాడుతూ మరో 39 మంది ప్రాణాలు కోల్పోయారు. అదే సమయంలో కోవిడ్ నుంచి 13,827 మంది కోలుకున్నారు. దీంతో మొత్తం కోలుకున్నవారి సంఖ్య 98.55 శాతానికి చేరింది. కరోనా వైరస్ కొత్త కేసుల పెరుగుదల కారణంగా క్రియాశీల కేసులు సైతం క్రమంగా పెరుగుతున్నాయి. ఇప్పటికే లక్ష మార్కును దాటాయి. ప్రస్తుతం మొత్తం కేసుల్లో క్రియాశీల కేసుల సంఖ్య 0.24 శాతం వద్ద ఉంది. కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ వెల్లడించిన సమాచారం మేరకు మొత్తం కరోనా కేసుల సంఖ్య 4,34,52,164లకు చేరుకోగా, మొత్తం మరణాలు - 5,25,116లకు చేరుకున్నాయి. కోలుకున్నవారి సంఖ్య: 4,28,22,493 కాగా దేశంలో మొత్తం క్రియాశీల కేసుల సంఖ్య 1,04,555 కి చేరింది. కరోనా వైరస్ కొత్త కేసులు దాదాపు నాలుగు నెలల తర్వాత గరిష్ఠ సంఖ్యలో నమోదయ్యాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 20న 19,968 కొత్త కేసులు నమోదైన తర్వాత అత్యధికంగా కరోనా కేసులు నమోదుకావడం ఇదే మొదటిసారి. దేశంలో బుధవారం 14,17,217 మందికి కోవిడ్-19 వాక్సిన్ డోసులు అందించారు. దీంతో ఇప్పటివరకు పంపిణీ చేసిన వాక్సిన్ డోసుల సంఖ్య 1,97,61,91,554 కోట్లకు చేరింది. ఇందులో మొదటి డోసుల సంఖ్య 91.8 కోట్లుగా ఉండగా, రెండు డోసులు తీసుకున్నవారి సంఖ్య 84.3 కోట్లకు పెరిగింది. కొత్తగా మరో 4,52,430 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.

ఢిల్లీని తాకిన నైరుతి రుతుపవనాలు

నగరంలో భారీగా ట్రాఫిక్ జామ్

న్యూఢిల్లీ : నైరుతి రుతుపవనాలు దేశ రాజధాని ఢిల్లీ తాకాయి. గురువారం కురిసిన భారీ వర్షాల కారణంగా నగరం జలమయమైంది. నూతనంగా ప్రారంభమైన ప్రగతి మైదాన్ టన్నెల్, ఐటీఓ, రింగ్ రోడ్, బారాపుల్లా కారిడార్, ఢిల్లీ - మీరట్ ఎక్స్‌ప్రెస్ వే, సరాయ్‌కాలే ఖాన్ సహా పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. రోడ్లపై భారీగా నీరు నిలిచిపోవడంతో వాహదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మెహ్రౌలీ-బాదర్‌పూర్ రోడ్డులో వాహనాల రాకపోకలను ట్రాఫిక్ పోలీసులు పూర్తిగా నిలిపివేశారు. ఢిల్లీ-నొయిడా, చిల్లా సరిహద్దులు సహా యూపీ గేట్, ఢిల్లీ-గురుగ్రామ్ రహదారులపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది. నగరంలో కురిసిన వానకు జలమయమైన రోడ్లకు సంబంధించిన వీడియోలు వివిధ సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రసారమయ్యాయి.

అత్యాధునిక సాంకేతికతతో నిర్మించిన ప్రగతి మైదాన్ టన్నెల్‌లో చుక్క నీరు నిలువదని పీడబ్ల్యూడీ అధికారులు చేసిన వ్యాఖ్యలకు భిన్నంగా టన్నల్‌లో నీరు చేరడంపై నెటిజన్లు వివిధ రకాల కామెంట్లతో విమర్శలు గుప్పించడం గమనార్హం.

బీహార్‌లో అతిపెద్ద పార్టీగా మళ్లీ ఆర్జేడీ

నలుగురు ఎంఐఎం ఎమ్మెల్యేల చేరికతో పెరిగిన బలం

పాట్నా: ఆలిండియా మజ్లిస్ ఏ ఎతిహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం)కు చెందిన బీహార్ ఎమ్మెల్యేలు నలుగురు బుధవారం రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ)లో చేశారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో సీమాంచల్ ప్రాంతంలో ఏఐఎంఐఎం తమకున్న బలాన్ని చాటుకోవడం విదితమే. రాష్ట్రంలో ఏఐఎంఐఎంకు ఐదుగురు ఎమ్మెల్యేలు ఉండగా వారిలో నలుగురు ఆర్జేడీ కండువా కప్పుకున్నారు. దీంతో ఆర్జేడీ మరోమారు అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించింది. ప్రస్తుతం ఆర్జేడీ ఎమ్మెల్యేలు 80 మంది ఉన్నారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో 75 స్థానాలను గెలిచి అతిపెద్ద పార్టీగా ఆర్జేడీ నిలిచింది. బీజేపీ 74 స్థానాల్లో గెలిచింది. ఈ ఏడాది మార్చిలో వికాశ్‌శీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ)కి చెందిన ముగ్గురు శాసనసభ్యులు కాషాయ కండువా కప్పుకోవడంతో కమలం పార్టీ బలం పెరిగింది. దాంతో ఆర్జేడీని వెనక్కినెట్టివేసింది. కానీ ఇప్పుడు మరోమారు బీజేపీ నుంచి తన స్థానాన్ని ఆర్జేడీ తిరిగి దక్కించుకోగలిగింది. ఈ పరిణామాలతో జనతాదళ్ (యునైటెడ్) (జేడీయూ)తో కలిసి ప్రభుత్వం ఏర్పాటునకు ఆర్జేడీ కసరత్తు చేస్తుందా అన్న ప్రశ్న తెరపైకొచ్చింది. తమకు అలాంటి ఉద్దేశం లేదని విలేకరుల సమావేశంలో బీహార్ ప్రతిపక్ష నేత తేజశ్వియాదవ్ స్పష్టంచేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమకు ఎక్కువ స్థానాలు రావడం, ఆపై వీఐపీ ఎమ్మెల్యేల మద్దతుతో బీజేపీ అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించడాన్ని ప్రస్తావించారు. 76 మంది ఎమ్మెల్యేలు ఉండగా ప్రస్తుతం ఏఐఎంఐఎం నుంచి నలుగురు చేరడంతో తమ సంఖ్య 80కు పెరిగిందని చెప్పారు. రాజ్యాంగబద్ధంగా జరిగిన ఈ విలీనాన్ని ఎవ్వరూ ప్రశ్నించలేరన్నారు. తమకు అధికార దాహం లేదని అన్నారు. బీజేపీ, జేడీయూ పరస్పరం అవమానించుకుంటూనే కలసి ఉండటాన్ని బట్టి ఆ పార్టీలకున్న అధికార దాహమెంతో తెలుస్తోందని వ్యాఖ్యానించారు. బీజేపీ అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించిన తర్వాత ఏఐఎంఐఎం ఎమ్మెల్యేలను ఆర్జేడీ ప్రలోభాలకు గురిచేసినట్లు వచ్చిన వార్తలను ఏఐఎంఐఎం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే అక్తరుల్ ఇమాన్ కొట్టిపారేశారు. 'ఆర్జేడీ రాణిస్తే ఏఐఎంఐఎం మద్దతిస్తుందని అసెంబ్లీలోనే చెప్పాను. కాబట్టి ఈ విలీనంపై ప్రశ్నలు అనవసరం. అవన్నీ వదంతులు.

మా ఎమ్మెల్యేలు ఏఐఎంఐఎంతోనే ఉన్నారు' అని ఆయన చెప్పారు. తాజా పరిణామాలతో రాష్ట్ర రాజకీయాలపై పెద్దగా ప్రభావం ఉండదని, ఇక ఏఐఎంఐఎంకు రాష్ట్రంలో భవిష్యత్ లేదన్న అభిప్రాయాలు నిపుణుల్లో ఉన్నాయి. సీమాంచల్‌కు మిగతా రాష్ట్రంలోని పరిస్థితులకు తేడా ఉండటం వల్ల ఆర్జేడీలోకి విలీనంతో ఏఐఎంఐఎంకు అవకాశాలు పెద్దగా ఉంకపోవచ్చు అని సీనియర్ జర్నలిస్టు మణికాంత్ ఠాకూర్ అన్నారు. ఉత్తరప్రదేశ్, బెంగాల్ రాష్ట్రాల్లో తగిలిన దెబ్బల వల్లనే బీహార్‌లోని ఏఐఎంఐఎం ఎమ్మెల్యేలు ఆర్జేడీ గూటికి చేరారని కొందరు నిపుణులు అన్నారు.

ప్రజల పత్రిక విశాలాంధ్ర

- ప్రజాసమస్యలపై పోరుబాటకు ఉద్భవించిన విప్లవ పత్రిక
- తుడా ఉపాధ్యక్షుడు హరికృష్ణ
- ఇది శ్రమజీవుల మాతృక: ఓబులేసు
- తిరుపతిలో విశాలాంధ్ర 70వ వార్షికోత్సవం
- విలేకరులకు ఘనసన్మానం

విశాలాంధ్ర 70వ వార్షికోత్సవ సభలో ప్రసంగిస్తున్న హరికృష్ణ, ఓబులేసు, వేదికపై హరినాథరెడ్డి, కూన అజయ్ బాబు, రామచంద్రారెడ్డి, మురళి, నాగరాజన్,విశ్వనాథ్, పెంచలయ్య, ప్రసాద్, సుబ్బరాయుడు.

విశాలాంధ్ర-తిరుపతి: ప్రజా సమస్యలపై పోరుబాట కోసం ఉద్భవించిన విప్లవ పత్రికే విశాలాంధ్ర అని తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ(తుడా)ఉపాధ్యక్షుడు ఎస్.హరికృష్ణ పేర్కొన్నారు. తిరుపతిలోని గంధమనేని శివయ్య, కృష్ణారెడ్డి భవన్‌లో విశాలాంధ్ర 70వ వార్షికోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. బ్యూరో ఇన్‌చార్జ్ డాక్టర్ ఎం.ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో హరికృష్ణ మాట్లాడుతూ పాఠశాల దశ నుంచే పత్రికలు చదివే అలవాటు తనకుం దని, పాఠకులు ఆతృతగా చదవాలనేలా విశాలాంధ్రలో వార్తలు ఉంటాయని తెలిపారు. వార్తల నాణ్యతలో రాజీపడని ఏకైక పత్రిక విశాలాంధ్రని ప్రశంసించారు. వార్తలకు ప్రాధాన్యత ఇవ్వడం ఒక్క విశాలాంధ్రలో కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. విశాలాంధ్ర వందేళ్ల సభ జరుపుకోవాలని ఆకాంక్షించారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి కోశాధి కారి జి.ఓబులేసు మాట్లాడుతూ విశాలాంధ్ర పత్రిక శ్రమజీవుల మాతృకని తెలిపారు. తెలుగు నేలపై ఆవిర్భవించిన మొదటి తెలుగు దినపత్రిక విశాలాంధ్రేనని చెప్పారు. పత్రికను నడపడానికి నాటి పెద్దలు చాలా త్యాగాలు చేశారని గుర్తు చేశారు. గతం నుంచి నేటి వరకు పత్రికలే విప్లవాలను నడిపాయన్నారు. పత్రిక మార్గదర్శి లాంటిదని, ఆ పాత్ర విశాలాంధ్ర చక్కగా పోషించిందని వివరించారు. నిర్బంధాలు, నిషేధాల సమయంలోనూ విశాలాంధ్ర నడిచిందని, అందుకు ప్రజలు, పాఠకులే కారణమన్నారు. తెలంగాణ సాయుధ పోరాట సమయంలో ఓ సమరయోధుడు విశాలాంధ్ర పత్రిక దొరకకపోతే ఆ రోజు నాకు దుర్దినం అన్నారని గుర్తుచేశారు. ప్రస్తుతం చాలా పత్రికలు పాలకవర్గాలకు అనుగుణంగా వార్తలు రాస్తున్నాయన్నారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, పరిటాల రవి చనిపోయినప్పుడు వివిధ పత్రికలు రాసిన కథనాలే ఇందుకు నిదర్శనమని గుర్తుచేశారు. విశాలాంధ్ర ప్రజాఉద్యమాల ప్రతిబింబమని కొనియాడారు. నేడు చాలా పత్రికలు కర్షకులు, కార్మికుల సమస్యలు ప్రస్తావించకుండా పాలకులకు కొమ్ము కాస్తున్నాయని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో విశాలాంధ్ర విశ్వసనీయత కోల్పోకుండా వార్తలు ప్రచురిస్తూ ప్రజాపక్షపాతిగా నిలిచిందని చెప్ప డంలో సందేహం లేదన్నారు. విశాలాంధ్రకు రాఘవాచారి చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. సంఘ సంస్కర్తలను తెలుగు నేలకు పరిచయం చేసిన పత్రిక విశాలాంధ్రేనని చెప్పారు. కవులు, విప్లవకారులు రాసిన కథనాలను ప్రజలకు చేరువచేసిన పత్రిక కూడా విశాలాంధ్రేనన్నారు. కానీ ఈ పత్రికకు పాలకులు, ప్రభుత్వాల నుంచి ఎప్పుడూ సహకారం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు, పాఠ కులే విశాలాంధ్రకు అండదండలని చెప్పడానికి గర్వి స్తున్నానని చెప్పారు. పత్రిక మనుగడకు ప్రజలు, పాఠకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శ్రీసిటీ జనరల్ మేనేజర్ పి.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ విశాలాంధ్ర విభిన్నమైన, విలక్షణమైన పత్రికని కొనియాడారు. ఈ పత్రిక విలేకరులు అవలంబించే విధానాలు మిగిలిన పత్రికల విలేకరులతో పోలిస్తే భిన్నంగా ఉంటాయని చెప్పారు. విశాలాంధ్ర జనరల్ మేనేజర్ పి.హరినాథరెడ్డి మాట్లాడుతూ విలువలకు కట్టుబడి నడిపే పత్రిక విశాలాంధ్రని చెప్పారు. పాలకులు, ప్రభుత్వాల బెదిరింపులకు జంక కుండా నిజాలను నిర్భయంగా ప్రచురించడంలో విశాలాంధ్రకు ఏ పత్రిక చాటిరాదన్నారు. నీలవేణి కథల సంపుటిని విశాలాంధ్ర ప్రచురించిందని గుర్తు చేశారు. నాటి నుంచి నేటి వరకు ప్రజల పక్షాన నిలిచిన పత్రిక విశాలాంధ్రని వక్కాణించారు. విశాలాంధ్ర లేకపోతే శ్రీశ్రీ, గిడుగు వంటి కవులు ప్రజలకు తెలిసేవారు కాదన్నారు. సమాజం, ప్రజలకు అవసరమైన పత్రిక విశాలాంధ్రన్నారు. పత్రికలలో విషయమే ప్రధానమని, రంగులు కాదన్నారు. నేటి పరిస్థితుల్లో పత్రికను నడపడం ముఖ్యమని, విశాలాంధ్రను సైతం ఆధునిక పోకడలకు అనుగుణంగా మార్చేందుకు ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. ఇంటర్నెట్ ఎడిషన్‌పై దృష్టి సారిస్తున్నామని, ఇందుకు విలేకరులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. దీనిపై అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా మనం కూడా ఎదగాలని హితోపదేశం చేశారు. ప్రస్తుతం వార్తలు ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో ఉంచడానికి ప్రయత్నం చేస్తున్నామన్నారు. జర్నలిస్టులకు వృత్తి పన్నేమిటని ప్రశ్నించారు. అక్రిడేషన్ల కోసం ధర్నాలు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. విశాలాంధ్ర పత్రికను ప్రజలలోకి తీసుకెళ్లేందుకు అందరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. విశాలాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్‌బాబు మాట్లాడుతూ రైతు ఉద్యమంపై వాస్తవిక కథనాలను సవివరంగా ప్రచురించిన పత్రిక విశాలాంధ్రేనని గుర్తు చేశారు. కార్మికుల సమస్యలు, హక్కుల పరిరక్షణకు సంబంధించిన కథనాలు ప్రచురించడంలో విశాలాంధ్ర ముందుంటుందని నొక్కి చెప్పారు. అంతర్జాతీయ సమస్యలు, అంశాలపై ఒక్క విశాలాంధ్ర మాత్రమే కథనాలు ప్రచురిస్తున్నదని తెలిపారు. పత్రికా రంగంలో ప్రథమంగా కంప్యూటర్ వాడింది విశాలాంధ్రేనన్నారు. విశాలాంధ్ర పత్రిక కోసం ప్రజలు నిరీక్షిస్తుంటారని సోదాహరణంగా వివరించారు. సమస్యలపై ఆయా పార్టీల నాయకులకు ఫీడ్ బ్యాక్ అందించే పత్రిక తమదేనన్నారు. భవిష్యత్తులో డిజిటల్ విశాలాంధ్రను తీసుకొస్తున్నామని, అందుకు మీ సహకారం అవరమని విలేకరులను కోరారు. పత్రిక నడపడం, కథనాలు ప్రచురించడంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఆగేది లేదని, అడ్డంకులు సృష్టించే ప్రభుత్వాలపై పోరాడ తామని స్పష్టం చేశారు. అనంతరం ఇటీవల విశాలాంధ్రలో మంచి వార్తాకథనాలు రాసిన విలేకరులకు, పత్రిక పురోభివృద్ధిలో భాగంగా వాణిజ్య ప్రకటనలు సేకరించిన, పత్రిక సర్క్యులేషన్ పెంపుదలకు కృషిచేసిన పాత్రికేయులను శాలువాతో సత్కరించి, జ్ఞాపిక, బహుమతి అందజేశారు. వేదికపై ఆశీనులైన అతిథులను సన్మానించారు. జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న విశాలాంధ్ర పాత్రికేయులకు, ఎడిషన్ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి వార్షికోత్సవం సందర్భంగా జ్ఞాపిక, బహుమ తులు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన గేయాలు సభికులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విశాలాంధ్ర తిరుపతి ఎడిషన్ మేనేజర్ సుబ్బరాయుడు, సీపీఐ తిరుపతి, చిత్తూరు జిల్లా కార్యదర్శులు మురళి, నాగరాజన్, నగర కార్యదర్శి విశ్వనాథ్, ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి విలేకరి కోటేశ్వర బాబును సన్మానించి జ్ఞాపిక, బహుమతి అందజేస్తున్న హరినాథరెడ్డి

కేరళ సీఎంపై హక్కుల తీర్మానం: యూడీఎఫ్

తిరువనంతపురం: కేరళ సీఎం పినరయి విజయన్ బంగారం అక్రమ రవాణా వ్యవహారాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ప్రతిపక్ష యూడీఎఫ్ ఆరోపించింది. ఆ కేసును తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు చేసిన సీఎంపై అసెంబ్లీలో ప్రివిలేజ్ మోషన్ తీర్మానాన్ని ప్రవేశ పెట్టనున్నట్టు కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ గురువారం వెల్లడించింది.

ఎస్సీ, ఎస్టీలపై నేరాల నివారణ అవశ్యం

- దురాగతాలపై ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యం చేయొద్దు
- అన్ని రాష్ట్రాలకు కేంద్ర హోంశాఖ సూచనలు

న్యూఢిల్లీ: ఎస్సీ, ఎస్టీలపై నేరాలను నియంత్రించడం అవశ్యమని కేంద్ర హోంశాఖ పేర్కొంది. వారిపై జరిగే దురాగతాలకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లను నమోదు చేయడంలో జాప్యం చేయొద్దు అని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు గురువారం సూచించింది. ఏదేని కేసు విచారణ రెండు నెలలకు మించి జరిగినట్లే యితే దానిని ప్రభుత్వాధికారులు నిశితంగా గమనించాలని పేర్కొంది. ఎస్సీలు, ఎస్టీలకు సంబంధించి కేసుల విచారణ సత్వరమే సాగేలా చూడటమే కాకుండా సంబంధిత పోలీసు అధికారులు, అధికారిక సాక్షులు, ప్రాసిక్యూషన్ సాక్షుల రక్షణ, హాజరీని జిల్లా ఎస్పీ చూసుకోవాలని హెూంశాఖ పేర్కొంది. ఎఫ్ఐఆర్ నమోదు మొదలు కోర్టులో కేసు కొట్టివేసే వరకు అన్ని స్థాయిల్లో విచారణ సక్రమంగా జరిగేలా చూడాలని సూచించింది. ఎఫ్ఐఆర్ నమోదైన 60 రోజుల తర్వాత కూడా దర్యాప్తు కొనసాగితే ఆ కేసులను జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు పరిశీలించాలని, ఇలాంటి సమీక్ష ప్రతి మూడు నెలలకు ఒకసారి జరగాలని పేర్కొంది. ఎస్సీ, ఎస్టీల జాతీయ కమిషన్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు సంబంధిత కేసులను సమీక్షించాలంది. నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి ముందస్తు జాగ్రత్త చర్యలను చేపట్టడం ద్వారా ఎస్సీ, ఎస్టీల ప్రాణాలతో పాటు ఆస్తులను పరిరక్షించాలని సూచించింది.



Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.